
# బాల



## పిల్లల బొమ్మల పత్రిక

Vol. 1 : No. 11

**BALA**

6

★ ఆంధ్రలోకానికి అమరసందేశము ★

శ్రీ ప్రభాకర ప్రొడక్షన్సువారి ప్రథమ సాంఘిక చిత్రం




శ్రవణానందకరమైన పాటలతో, తీయని మాటలతో, చక్కని తేలికైన హాస్యంతో, రమణీయమైన నాట్యాలతో మిమ్ములను ముగ్ధులనుగాజేయు ప్రేమమయ జీవితగాథ.

# పెప్పర్ మెంటు బిళ్లలు !

[ఏకాంక నాటిక]

చెల్లెలు :- అక్కా ! నోరు అరుచిగావుంది. తినడానికి ఏమైనా వుందా ?

అక్క :- అన్నట్టు చెప్పడం మరిచాను. నిన్న నాన్నగారు మద్రాసునుంచి మంచి పెప్పరమెంటు బిళ్లలు తెచ్చారు......

చెల్లెలు :- ఏవీ ? - ఎక్కడున్నాయి !

అక్క :- ఇవుగో ! ఇంద. తిను.

చెల్లెలు :- (తినుచూ) బలే బాగున్నాయి ! ఇంతమంచివి ఎవరు తయారుచేశారో !

అక్క :- ఇవి మద్రాసు కుమరన్ కన్ఫెక్షనరీ వర్క్సు వారు తయారుచేశారని నాన్నగారు చెప్పారు.

చెల్లెలు :- మనదేశంలో, మనవారుకూడా ఎంత బాగా తయారుచేస్తున్నారో ! బలే రుచిగా, సువాసనగా వున్నాయి.

అక్క :- అవును. ఇది మనహిందువులు పెట్టిన చేతిపరిశ్రమ.

కావలసినవారు :

**KUMARAN CONFECTIONERY WORKS,**

**54, Badrian St. ★ G. T., MADRAS.**



# ప్రఖ్యాతిచెందిన వైద్యులు పిల్లల లివర్ వ్యాధులకు ఈ ప్రత్యేకౌషధమును నిర్ణయించి మంచి ఫలితములను పొందినారు.

ఒక డాక్టరు వ్రాసినది :—

ఈ బిడ్డల లివరు వ్యాధులకు మీ ప్రత్యేకౌషధములను నాలుగు సంవత్సరములనుండి వాడుచున్నాను. మొదటి రెండు సంవత్సరములలో వాటి అనుభవమును, నమ్మకము నాకు చాలతక్కువ.

ఈ ప్రత్యేకౌషధములపై నా విశ్వాసము అధికమైన కొలది, ధారాళముగా వాడి ఆశలు వదలుకొన్న స్థితులలోకూడ అద్భుతమైన ఫలితములు పొందినాను.

ఈ విధముగా ఈ ప్రాంతములలో వ్యాపించియున్న లివర్ వ్యాధినుండి అనేక జీవితములు రక్షింపబడినవి.



ముదిరిపోయిన లివరు రోగి

**Jammi Venkataramanayya & Sons**

జమ్మి వెంకటరమణయ్య అండు సన్స్

8, శాలై వీధి, మైలాపూరు, మద్రాసు

టెలిఫోను నెం. 8139 పో. బా. నెం. 608

టెలిగ్రాం: 'లివర్ క్యూర్' మద్రాసు

వ్యాధి ఆరంభస్థితి, ముదిరిన స్థితులలోకూడ ప్రత్యేకౌషధములు ఈయబడును



# GRIPE-COL

**(For Children's Disorders)**

**A MECLEC PRODUCT**

HEPATOGEN · BETA GEN · FERRADAGEN · GRIPE-COL · MALT-EXTRACT

## మెక్ లెక్

# గ్రైప్ - కొల్

శిశువులయొక్క, పసిబిడ్డలయొక్క ఆరో
గ్యము, అభివృద్ధికిగాను ఉపయోగించు
రుచికరమగు పానీయము.

పిల్లలకు సాధారణముగా వచ్చు అజీర్తి,
కడుపుబ్బరము, కక్కులు, విరేచనములు,
పళ్లు మొలచునపుడు కల్గు నొప్పులు మొదలగు
వానిని పోగొట్టుటకు మిక్కిలి ఉపయోగించును.

మీ బిడ్డలను ఆరోగ్యవంతముగ నుంచుటకు
గ్రైప్ - కొల్‌ను తప్పక వాడుడు.

అన్ని మందుల షాపులలోను దొరకును.

కంపెనీనుండికూడ వ్రాసి తెప్పించుకోవచ్చును:

**The Meclec Nutriments & Pharmaceuticals Ltd.,**

99-A, Armenian St., :: G. T. Madras.

## బాలలకు బాహుమంచి పుస్తకములు

మద్రాసు టెక్స్టు బుక్కు కమిటి వారిచే అప్రూవు కాబడిన

# రాయల వాచకములు

(1, 2, 3, 4, 5 తరగతులకు)

ఈ క్రింది పుస్తకములు తెల్లని గ్లేజుకాగితమున పెద్ద అక్షరములలో ముచ్చటగా ముద్రింపబడినవి. ఇంతవరకు ఇటువంటి శుదమగు పుస్తకములు వెలువడియుండలేదు.

| | | | |
|---|---|---|---|
| రామరామ శతకము | | శ్రీమద్రామాయణ గొబ్బిపాట | 0—2—0 |
| నారాయణ శతకము | 0—2—0 | భాస్కర శతకము | 0—2—0 |
| సుమతి శతకము | 0—2—0 | నరసింహ శతకము | 0—4—0 |
| కృష్ణ శతకము | 0—2—0 | గజేంద్ర మోక్షము | 0—4—0 |
| బాలరామాయణము | 0—2—0 | రుక్మిణీ కల్యాణము | 0—4—0 |
| దాశరథి శతకము | 0—2—0 | అమరకోశము | 0—4—0 |

మద్దులేటి నృసింహ శతకము, (పాకెట్ సైజు. కందములు) 0—2—0

2—0—0లు పంపినవారికి 12 పుస్తకములు రిజష్టరు పోస్టులో పంపెదము.

---

ఈ క్రింది పుస్తకములు గ్లేజుకాగితమున చక్కని అక్షరములలో ముద్రింపబడినవి.

| | | | |
|---|---|---|---|
| కృష్ణశతకము టీకాతాత్పర్యము | 0-4-0 | గజేంద్ర మోక్షము టీ॥ తా॥ | 0-8-0 |
| సుమతి శతకము ,, గ్లేజు | 0-4-0 | నరశింహ శతకము ,, ,, | 0-8-0 |
| బాలరామాయణము ,, ,, | 0-4-0 | అమరకోశము ,, ,, | 0-8-0 |
| దాశరధి శతకము ,, ,, | 0-6-0 | నీతిశాస్త్రము తాత్పర్యము | 0-4-0 |
| భాస్కర శతకము ,, ,, | 0-8-0 | నీతిచంద్రిక 146 పుటలు | 0-10-0 |

గృహ సరస్వతి (ఇంగ్లీషు అక్షరములు నేర్చుకొనుటకు) 0-4-0

ఆంగ్లో తెలుగు ప్రైమరు Anglo-Telugu Primer 0-5-0

రాయల గణితబోధిని 0-1-0 ఆంధ్రనామ సంగ్రహము సటీక 0-10-0

5-0-0 లు మణియార్డరుద్వారా పంపినవారికి పోస్టేజి మేమే భరించి రిజష్టరు పోష్టుద్వారా పుస్తకములను పంపెదము.

: వివరములకు :

రాయలు అండు కో., పబ్లిషర్సు, కడప.



సంపాదకుడు :
న్యాయపతి రాఘవరావు, బి.ఎ.

సహాయ సంపాదకులు :
న్యాయపతి కామేశ్వరి, బి.ఎ., ఎల్.టి.

సంపుటి 1.] మదరాసు, 1 జూన్, 1946 [సంచిక 11.

# మంత్రులు - పక్షాలు

మనం ఆటలాడుకున్నా, పోట్లాడుకున్నా రెండు పక్షాలుగా ఏర్పడతాం. పక్షం అంటే ఒక జట్టు అని అర్థం.

"చెన్నపురి రాజధాని" అన్న మాట మీరు విన్నారా? మన ఆంధ్రదేశం, అరవదేశం, కన్నడ దేశం, మలయాళ దేశం—యీ నాలుగు దేశాలలోని కొన్ని భాగాలు కలిసి, ఇంగ్లీషువారు "చెన్నపురి రాజధాని" అని ఒక రాజ్యం ఏర్పరిచారు.

ఈ రాజధానిని పరిపాలించడానికి యీ మధ్య కొన్ని పక్షాల వారు పోటీ తగిలారు. మన 'బాలరాజ్యం' లో రాముపక్షం, సోముపక్షం, సరళపక్షం, విరళపక్షంవారు పోటీతగిలినట్టే, కాంగ్రెసు పక్షం, ముస్లింలీగు పక్షం, హిందూమహాసభపక్షం - ఇలాగ పక్షాలు ఏర్పడి పోటీ తగిలారు.

కాంగ్రెసుపక్షం వారు స్వరాజ్యంకోసం చాలా కష్టపడి పని చేస్తున్నారు కనుక కాంగ్రెసు నాయకులకే అందరూ వోట్లు, ఇచ్చారు. అంటే అర్థం ఏమిటి?- మనదేశంలో కాంగ్రెసు రాజ్యం వచ్చింది.

ఈ కాంగ్రెసు రాజ్యానికి ఇప్పుడు 11 మంత్రులువున్నారు. అందులో 5 గురు మంత్రులు తెలుగువారు. వారిని గురించి కొంచెం మీకు తెలియాలిగా! పేజీత్రిప్పి చూడండి.

# కాంగ్రెసు మంత్రులు



శ్రీ టంగుటూరి ప్రకాశం

వీరే, మంత్రులందరికీ పెద్ద మంత్రి (ప్రధాన మంత్రి). వీరినే "ఆంధ్రకేసరి" అని పిలుస్తారు. కేసరి అంటే సింహం. సింహానికి వున్నంత ధైర్యం వీరికి వుంది!

చిన్నప్పుడు ప్రకాశంగారు బలే పెంకితనం చేసేవారట. నాటకాల్లో ఎంతో బాగా నటించి పేరుపొందారు. లండనులో బారిష్టరు చదివి, ప్లీడరు పనిలో బాగా ధనం సంపాదించారు. కాని, అదంతా వదిలి దేశసేవ చేసి జెయిలుకి ఎన్నోసార్లు వెళ్ళారు.

మన దేశంలో, కరువూ, భయంలేకుండా, మన రాజ్యాన్ని హాయిగా నడిపే బాధ్యత వీరు పూనుకున్నారు.



శ్రీ వి. వి. గిరి

మన దేశంలో చాలామంది వ్యవసాయం చేసుకొనే బ్రతుకుతున్నారు. కాని కొందరు మిల్లులలోనూ, కంపెనీలలోనూ పనులు చేసి బ్రతుకుతున్నారు. డబ్బుగలవారు అనేక మిల్లులు పెట్టి, అందులో అనేకమంది కూలివారికి జీతాలిచ్చి పని చేయిస్తున్నారు. దేశంలో యీ పరిశ్రమలు పెట్టించడం, అందులో పని చేసేవారి బాగోగులు చూడడం— యీ పనినిచూచే శాఖకి శ్రీ గిరిగారు మంత్రి.

శ్రీ గిరిగారు యీ పనిలో ఆరితేరి చాలా పేరు సంపాదించారు. బారిష్టరు పని వదిలి, కాంగ్రెసులో చేరి దేశానికి చాలా సేవచేస్తున్నారు.

# కాంగ్రెసు మంత్రులు



శ్రీ కె. కోటిరెడ్డి

శ్రీ కోటిరెడ్డిగారు కూడా బారిష్టరుపని వదిలి కాంగ్రెసులో చేరినవారే. రాయలసీమలో తెలుగువారికి వీరు నాయకులు. మన దేశంకోసం గొప్ప త్యాగం చేసినవారు.

మన రాజధానిలో, సింహాచలం, తిరుపతి, కంచి, మధుర, తంజావూరు మొదలైనవూళ్లలో గొప్ప గొప్ప కోవెలలున్నాయి. అనేకమంది భక్తులు ఆ దేవుళ్ళకు ఎంతో ధనం, భూములు దానంచేశారు.

ఈ దేవాలయాల విషయాలన్నీ జాగ్రత్తగా జరుగుతున్నాయో లేదో చూచే మంత్రి పదవి శ్రీ కోటిరెడ్డిగారిది.



శ్రీ ఆచంట రుక్మిణమ్మ

ఈమె డాక్టరు లక్ష్మీపతిగారి భార్య. కాంగ్రెసులో చాలా కాలంనుంచి పనిచేశారు. ఆరోగ్య, వైద్యశాఖకు ఈమెయే మంత్రి. "మన దేశం బాగుపడాలంటే అందరూ ఆరోగ్యంగా వుండాలి. పిల్లలు ఆరోగ్యంగా వుంటే, వారు పెద్దవారై దేశానికి ఎంతో సేవచేయడానికి శక్తికలిగి వుంటారు. పిల్లల ఆరోగ్యం తల్లుల చేతుల్లోవుంది. అందుచేత తల్లులకి ముఖ్యంగా ఆరోగ్య పద్ధతులు తెలియచేయాలి"—అని యీమె అన్నారు.

దేశంలో కావలసినన్ని వైద్యశాలలు లేవు. వైద్యశాస్త్రం నేర్పే పాఠశాలలు లేవు. ఈ పనులన్నీ చూచే బాధ్యత యీమెదే.

## శ్రీ వి. కూర్మయ్య

వీరు హరిజనులు. అయినా బాగా చదువుకొని, కాంగ్రెసులో చేరి పెద్దపేరు సంపాదించారు.

రాజ్యపరిపాలనలో అనేక సంగతులుంటాయి. అనేక విషయాలుంటాయి. ఆ విషయాలన్నీ అందరికీ తెలియాలి. ప్రజల అభిప్రాయాలు మంత్రులకీ, మంత్రులు చేస్తున్నపనులు ప్రజలకీ తెలియాలి. అలాగ ఎప్పటికప్పుడు తెలుస్తేనే రాజ్యం బాగా నడుస్తుంది.

అలాగ ఎప్పటికప్పుడు రాజ్య పరిపాలనా విషయాలు ప్రజలకు తెలియజేయడానికి ఒక మంత్రి కావాలి. శ్రీ కూర్మయ్యగారు ప్రచారక మంత్రిగావుండి యీ విషయాలన్నీ చూస్తున్నారు.

## ఇతర మంత్రులు

మదరాసు రాజ్యంలో యీ అయిదుగురే కాకుండా, ఇంకా ఆరుగురు మంత్రులున్నారు.

శ్రీ యం. భక్తవత్సలంగారు రోడ్లు, వంతెనలూ, కాలువలూ మొదలైనవి చూస్తారు.

శ్రీ కె. ఆర్. కరంతుగారు మన రాజ్యంలోని ఆదాయం గురించి చూస్తారు.

శ్రీ కె. భాష్యంగారు జైళ్లు, న్యాయశాఖ చూస్తారు.

శ్రీ టి. యస్. అవినాశిలింగంగారు విద్యాశాఖ చూస్తారు.

శ్రీ కుమారస్వామి రాజాగారు వ్యవసాయశాఖ చూస్తారు.

శ్రీ డానియల్ థామస్ గారు జిల్లాబోర్డులు, మునిసిపాలిటీలూ— ఆ శాఖ చూస్తారు.

ఇలాగ ప్రస్తుతం మొత్తం 11 మంది మంత్రులు, పనులన్నీ పంచుకొని ఈ చెన్నరాజధానిని పరిపాలిస్తున్నారు. తెలిసిందా?




# చక్కని బాలవు నీవైతే




చక్కని నెమలివి నీవైతే

రెక్కలు విప్పి ఆడెదవూ,



చక్కని చిలుకవు నీవైతే

'అక్కా' అనుచూ పలికెదవూ,



చక్కని పుంజువు నీవైతే

"కొక్కొరొక్కో" అని కూయుదువు.



చక్కని 'బాల'వు నీవైతే

పక్కన నవ్వగ జేసెదవూ.

ధూళిపాళ్ల కృష్ణమూర్తి.

# క చ ట త ప లు

అ ఆ ఇ ఈ

ఆ వు నే యీ

క కా కి కీ

కా య బా కీ

చ చా చి చీ

చా వు బూ చీ

ట టా టి టీ

ట్రం కు పె ట్టీ

త తా తి తీ

త న్ను కో తీ

ప పా పి పీ

ప చ్చ టో పీ


రచన: "అబ్బాయి"

# బొమ్మల పద్యం



గంగ గోవుపాలు

గంటెడైనను చాలు -



కడవడైన నేమి

ఖరము పాలు -



భక్తికలుగు కూడు

పట్టెడైనను చాలు

విశ్వదాభిరామ - వినుర వేమ !

సంపాదన: ఎడవల్లి శ్యామసుందర్, సామర్లకోట.

# తామర కాడలు

రచన: "షారదేవి" కాకినాడ.

అనగనగా ఒకవూళ్ళో కొన్ని కోతులు వున్నాయి. వాటిలో పెద్దకోతి రాజు. ఆ రాజుకోతి ఎల్లా చెప్పితే మిగతావన్నీ అల్లా వింటాయి. ఇల్లా వుండగా ఒక నాడు ఈ రాజుకోతి తక్కిన వాటిని పిలచి, "మనం దేశసంచారంచేస్తే జ్ఞానం, మంచి అనుభవం కల్గుతుంది, వెళ్దాము" అంది.

అన్నీ కూడ ఒప్పుకొని బయల్దేరాయి. కొండలూ, పర్వతాలు, అడవులూ, పల్లెలూ, పట్టణాలు దాటి చివరికి అవి ఒక అడవిలోకి వచ్చాయి. ఆ అడవిలోకి వచ్చేసరికి వాటికి దాహం ఎక్కువగా వేసింది. పాపం మంచి నీళ్ళు ఎక్కడా కనపడలేదు. వెతగ్గా వెతగ్గా చివరికి ఒక చెరువు కనపడింది. దానినిండా చాలా తామర ఆకులు, కలవ పువ్వులు వున్నాయి.

కాని ఆ చెరువులో ఒక రాక్షసి వుంది. అది పూర్వం ప్రజల్ని బాధిస్తుంటే ఒక మహాముని దానికి చెరువులో పడివుండి, అందులోకి నీళ్ళు త్రాగడాన్కి వచ్చిన జంతువుల్ని తింటూ, వుండమని, పైకిగనక వస్తే బుర్ర పగిలిపోతుందని శాపం ఇచ్చాడు. అందుచేత ఆ రాక్షసి ఆ చెరువులోనే ఉండి అందులోని నీళ్ళు త్రాగడానికి వచ్చిన జంతువుల్ని చంపేది.

చెరువుని చూడగానే కోతులు చంకలు ఎగరవేస్తూ నీళ్ళు త్రాగుదామని వెళ్లబోతున్నాయి. ఇంతలోనే రాజుకోతి ఆగమని కేకలేసింది. ఎక్కడవక్కడ ఆగిపోయి ఏమి అర్థంకాక రాజుకేసి చూస్తూ నిలబడ్డాయి. అప్పుడు రాజుకోతి ఇల్లా అంది: "ఈ చెరువులోకి వెళ్లేదారి చూడండి. చాలా పాదాల గుర్తులున్నాయి,

అన్నీ లోపలికి వెళ్లినవే కాని, పైకి వచ్చినవి ఒక్కటీ లేవు. కనుక మనం వెళ్ళామంటే ఏదో అపాయం వస్తుంది." అంది.

ఈమాటలు విన్న రాక్షసి చెర్లోంచి: "మరేం భయపడకండి కోతుల్లారా! నేనేం చెయ్యను. మీరు నీళ్ళు త్రాగండి" అంది.

"నువ్వు మాకేం సలహాలు ఇవ్వనక్కరలేదు. మా యిష్టం అయితే త్రాగుతాం. నువ్వు మాట్లాడకుండా వూరుకో" అంది.

దాంతోటి రాక్షసికి కోపం వచ్చి "మిమ్మల్ని అసలు మంచి నీళ్లే త్రాగనియ్యకుండా చేస్తాను చూడు! ఇక ఈ అడవిలో ఇదొకటే చెరువు!" అంది.

అందుకు రాజుకోతికికూడా కోపంవచ్చి "అయితే నీ ఎదురుగుండానే నీకు అందకుండానే మేము నీళ్ళు త్రాగుతాం చూసుకో" అని చెరువుమీదకు వంగిన ఒక చెట్టు కొమ్మమీదుగా ఎక్కి చివరిదాకా వెళ్ళి అక్కడి చెర్లో వున్న ఒక తామరకాడను తీసి ఒకచివర నోట్లో పెట్టుకొని, రెండో చివర నీళ్ళలో వదిలి పెట్టి నీళ్ళను గట్టిగా పీల్చింది. దాంతోటి ఆ తామరకాడకు బెజ్జం ఏర్పడి దానిగుండా నీళ్ళు కోతి నోట్లోకి వచ్చాయి. అన్నికోతులూ ఇల్లాగే చేసాయి.



పాపం రాక్షసి అల్లా వెర్రి మొహం వేసుకొని చూస్తు నించుండి పోయింది. అంతే!!!

కావలిస్తే మీరు చూడండి! తామరకాడ నోట్లో పెట్టుకుని నీళ్ళను పీలుస్తే నీళ్లు వస్తాయో రావో........

# ★ నర్తనశాల ★

రచన: శ్రీ రామాచార్యులు

భరత నాట్యాలు చూచేవుంటారు మీరంతాను.

'భరత నాట్యం', 'భరత నాట్యం' అంటూ వుంటారు. అంటే ఏమిటో తెలుసా? భరతునిచేత వ్రాయబడిన నాట్య శాస్త్రాన్ని చదివి, ఆచరించి, ప్రదర్శించేదాన్ని 'భరతుని నాట్యం' లేక 'భరత నాట్యం' అంటారు.

ఈ భరతుడు మన శ్రీరామచంద్రమూర్తి తమ్ముడనుకుంటారేమో! కాదు.

శకుంతల కొడుకూ కాదు.

మరెవరంటే—రెండువేల సంవత్సరాల క్రితం వుండే భరతముని.

ఇదిగో యీ బొమ్మచూశారా! వీరే ఆ 'భరతముని'.


భ — అంటే, భావము.

ర — అంటే, రాగము.

త — అంటే, తాళము,

భావ, రాగ, తాళముల కూడికయే—భ + ర + త = భరత అయిందని పెద్దలంటారు.

ఈ శాస్త్రాన్ని శివుడు, పార్వతి, బ్రహ్మ, విష్ణువు, నందికేశ్వరుడు, దత్తిలుడు, కోహళుడు, యాజ్ఞవల్క్యుడు, నారదుడు, ఆంజనేయుడు, విఘ్నేశ్వరుడు, సుబ్రహ్మణ్యుడు, బృహస్పతి, అర్జునుడు, రావణుడు, ఉషాకన్యక అనేవారు వ్రాశారు.



ఈ శాస్త్రం సంస్కృతంలో వ్రాయబడింది.

కొంతమంది దాన్ని యింగ్లీషులోకి మార్చి వ్రాశారు. తెలుగులోకికూడా యిప్పుడు కొందరు వ్రాస్తున్నారు.

మీ పాఠశాలలో యింగ్లీషు, తెలుగు, సంగీతం ఎలా చెబుతున్నారో, అలాగే నాట్యంకూడా కొన్ని పాఠశాలల్లో చెబుతున్నారు.

నాట్యం మీ పాఠశాలలో చెబుతున్నారా?

అలా అయితే—చదువు, సంగీతంతోబాటు నువ్వు నాట్యంకూడా నేర్చుకో ఏం!

---

"తోట" వాడ వేసిన యీ బొమ్మను సర్. శొంఠి వెంకటరామమూర్తిగారు దయతో ఇచ్చారు.

# నర్తన బాల



చి॥ కుముద (రాజమండ్రి)

రావుసాహెబ్ ముడుంబ వెంకటరంగ అనహరాచార్యులు (జమిందారు) వారి రెండో అమ్మాయి. వీరి ఇల్లు కళలకు పుట్టినిల్లు. ఈ అమ్మాయి మదరాసులోను, రాజమండ్రి 'నర్తనశాల' లోను, శ్రీ వేదాంతం జగన్నాధశర్మ, శ్రీ తిరు వేంగడయ్యగార్ల వద్ద కూచిపూడి, తంజావూరు పద్ధతుల నృత్యం నేర్చుకుంది. 2½ గంటలసేపు చక్కగా నాట్యం చేయగలదు. [వయసు 12 సం.]





ఆరోగ్యము, బలమునిచ్చు ఈ దివ్యౌషధముచే గత 50 సంవత్సరముల నుండి రోగులకు నిరంతర సేవచేయగలిగినామని సగర్వపడుచున్నాము.

**ఆయుర్వేదాశ్రమము, మద్రాసు**

EASTERNS 362

అన్ని మందుల షాపులలోను దొరకును.

ఆయుర్వేదాశ్రమం లిమిటెడ్ టి. నగర్, మద్రాస్.

# రెండో యెక్కం

రెండొకట్ల రెండు
నాకు కళ్లు రెండు
రెండురెళ్లు నాలుగు
ఆవుకి కాళ్లు నాలుగు
రెండు మూళ్లు ఆరు
మనకు ఋతువు లారు
రెండు నాల్గు లెనిమిది
సాలికాళ్లెనిమిది
రెండైదులు పొది
రావణుని తలలు పది
రెండార్లు పన్నెండు
మనకు నెలలు పన్నెండు
రెండేళ్లు పధ్నాల్గు
లోకాలన్నీ పధ్నాల్గు
రెండెనిమిదులు పదహారు
రూపాయికి అణాలు పదహారు
రెండు తొమ్మిదులు పద్ధెనిమిది
మనపురాణాలు పద్ధెనిమిది
రెండు పదు లిరవై
బారువకి మణుగు లిరవై.

రచన: యం. యస్. రామమూర్తి
పట్టాంబి (మలబారు)



ఎలా పుట్టిందీ?

# ★ కలువ పువ్వు ★

రచన: నిడదవోలు పార్వతీశ్వరరావు
(మదరాసు)

"చెల్లాయీ! కలువపువ్వు ఎలాగ పుట్టిందో ఆ కథ నీకు తెలుసూ?"

"నాకు తెలియదన్నయ్యా! నీకు తెలిస్తే చెప్పవూ?"

పూర్వం, మన్మథుడనే దేముడు, పువ్వులను పుట్టించే దేవతవద్దకు వెళ్ళి, "పువ్వులన్నిటికి రాణీగావుండే పువ్వను యిమ్మ"ని అడిగాడట.

ఆ రాణిపదవికోసం, గులాబీ పువ్వూ, తామరపువ్వూ పోటీలుగా లేచాయిట. గొప్పగొప్ప కవులంతా వాటి అందాలూ, చందాలు వర్ణించారుట.

"తామరపువ్వుకి రేకులు తెల్లగా ఉంటాయి - దానికి పెద్ద కాడ క్రిందవుంది-గులాబీపువ్వుకు అవేమీ లేవు, అందుచేత తామరపువ్వే రాణీ కావాలి" అని తామరపువ్వు జట్టు వాళ్లన్నారుట.

అయితే గులాబీపువ్వు జట్టు వాళ్ళన్నారుట: "తామరపువ్వు అందంగా లేదు. మంచి వాసన కూడా లేదు. దానికి ఎర్రటి మెత్తని రేకులేనా లేవు— అంచేత మా గులాబీపువ్వే రాణి అవాలి" అని గులాబిపువ్వుజట్టు వాళ్ళన్నారుట!

ఇలాగ, "మా గులాబిపువ్వు రాణి" అంటే "మా తామర పువ్వు రాణి" అని రెండు పార్టీల వాళ్ళూ పోట్లాడుకుంటున్నారు!

అపుడు మన్మథుడు "మృదువైన గులాబీపువ్వునూ, గంభీరంగా నున్న తామరపువ్వునూ కలిపి ఒకపువ్వుగా చేసిఇమ్ము" అని కోరేడుట. పుష్పదేవత అందిటా: "యిస్తాను కాని, ఏమి రంగుండాలి" అని అడిగితే, "రెండు రంగులూనూ" అని మన్మథుడన్నాడుట.

అప్పుడు పుష్పదేవత "గులాబి-ఎరుపూ" "తామర-తెలుపు" రెండు రంగులూ కలిసియున్న పువ్వును సృష్టించి యిచ్చిందట.

అదే యిప్పటి పువ్వులరాణి "కలువపువ్వు."


తలితండ్రులకు

మంచి సువాసనగల వక్కపొడి ఏది?

కుమరన్ వాసన వక్కపొడి

* * * *

తాతగారికి

ఘాటైన నశ్యము ఏది?

రాజా మద్రాసు నశ్యము

Selling Agents :—

**ALLIED INDUSTRIES & COMMERCIAL AGENCIES**

**54, Badrian St., G. T., Madras.**

# ఇసుక ఇల్లు



సరళా, రామూ, ఒకరోజు
సముద్రపొడ్డుకు వెళ్లేరు
ఇసుకను పోగుగ చేశారు
ఇంపగు ఇల్లునుకట్టేరు.

నాదీయిల్లు నాయిల్లు
నీదేకాదు నాయిల్లు
ఇట్లే అక్కా తమ్ముళ్ల
పోట్లాడుకున్నా రొకగంట.

సముద్రు డిల్లును చూశాడు
చాలా బాగుందన్నాడు
కెరటము పెద్దది పంపేడు
ఇరువురి తగువును తీర్చేడు.

రచన; బులుసువారబ్బాయ్.

# ★ బాలకు "హారం" ★

## "గిడుగన్నయ్య"

[క్రిందటి నెల "కారం" గల మాటలిచ్చాను. ఈ నెల "హారం"గల మాటల అర్థాలు యీ దిగువున ఇచ్చాను. ఆ మాటలు ఏమిటో మీరు చెప్పాలి. జవాబులు ఒచ్చే సంచికలో వేస్తాం.

1. కూడు.
2. వాడుక.
3. పండ్ల భోజనం.
4. చంపడం.
5. షికారు.
6. దెబ్బ.
7. కానుక.
8. ద్వారం.

**తీపి తీపి – కారం కారం:** గత నెల "బాల" లోని "కారం" గల మాట అర్థాలు: 1. ఆకారం; 2. ఉపకారం; 3. వెటకారం; 4. వికారం; 5. మమకారం; 6. ఘీంకారం; 7. అపకారం, 8. ప్రాకారం; 9. ప్రతీకారం.

# ఉడత - ఉలి

[పా ట క థ]

రచన: బుద్ధవరపు సూర్యనారాయణమూర్తి.

★

ఉడతలన్నీ కలిసి
ఉడుకురోజుల్లోన
ఊరుకట్టాలంటు
ఊక తెచ్చాయి–
ఊక తెచ్చాయి.

★




ఊకుడికిపోయింది;
ఉడతెగిరిపోయింది;
ఉడతెగిరిపోయింది;
ఉడతెగిరిపోయింది.
ఉన్న ఉడతల్లోన
ఉడతొకటి మిగిలింది.

★


ఉలి ఒకటి ఆదార్ని
ఊగుతూ పోతోంది

ఉడత చూసింది
ఉడత పలికింది—
"ఉలిగారు మాకొక్క
ఊరు కడతారా?
ఊరు కడతారా?"



★

ఉలి మారు పలికింది—




"ఊకతో ఊరా
ఉలిని పిలిచారా
ఉడతలకి ఊరా
ఉ ఊ ఉ ఊ ఉ ఊ"

★

ఉడత ఏమందపుడు?
"ఊరుకట్టాలేని
ఉలి బావగారూ!
ఊరుకో ఊరుకో
ఉలి బావగారూ!"

★


★



ఉలికి కోపం వచ్చి
ఉడతపై లేచింది
ఊఁ - పొడవబోయింది.
ఊకలో దూరింది ఉడత
ఉలికి కనపడలేదు ఉడత.
ఊకంత వెతికింది,
ఉలి పొడవ బోయింది.
ఊరంత వెతికింది
ఉలి ఉడతకోసమై.

★

ఉంది ఒక చెట్టుపై
ఉడత తోకాడిస్తు.
ఉలి పొడవ బోయింది
ఉడతెగిరిపోయింది
ఉలి పొడవ బోయింది
ఉడతెగిరిపోయింది
ఉలి పొడవ బోయింది
ఉడతెగిరిపోయింది
ఉలికి విసుగెత్తింది
ఉడత గంతేసింది.



# అఱపులు

గీ॥ "కావు కావ" ని అఱచును - కాకిపిట్ట,
కోడి "కొక్కొ_రోకో" యని - కూయుచుండు,
చిలుక ముద్దుగా మాటలు - "పలుకు" చుండు,
కోకిలము కూయు నింపుగా "కుహూ కుహూ" యని.

గీ॥ "ఘీం" యటంచు ఏనుగులు - ఘీంకరించు
కుక్క "భౌభౌ" యటంచును - చక్క_మొఱుగు
"మ్యావు, మ్యావ" ని పిల్లి తా - నఱచుచుండు
"కాంఢ్రు, కాంఢ్ర"ని యఱచును గాదె పులులు !

గీ॥ "ఓం ఉ, ఓం" యని గాడిద "ఓండ్రపెట్టు"
ఆవుదూడ "అంబే" యని - యఱచుచుండు
ఆవులో ? "అంబా" యని గదా - అఱచుచుండు,
"బుస్సు, బుస్స" ని పాములు - బుసను కొట్టు,
కప్ప "బెకబెక" లాడును గాదె! బాల ?

రచన : చామర్తి కామేశ్వరరావు,
టీచరు, కాశీబుగ్గ.

# ★ పిల్లి శకునము ★

రచన: శివరాజు సుబ్బరామయ్య. (గన్నవరం)

ఒక వూళ్ళో ఒక హరిదాసు వుండేవాడు. ప్రతీ రోజూ ఊళ్ళకు బిక్షానికి వెళ్ళేవాడు.

ఒకనాడు ఆ హరిదాసు బయలుదేరుతుండగా ఒక పిల్లి ఎదురైంది. కాని, అతడు దానిని లెక్కచేయక అలాగే వెళ్ళాడు.

ఆ పల్లెలో ఒక ఇంటి గుమ్మము వద్దకు వెళ్ళి, తన మామూలు ప్రకారం—

"నే చూచినాను, సీతమ్మను"—అని తనకొచ్చిన పాటను పాడాడు.

ఆ సమయానికే ఆ ఇంటి ఇల్లాలైన సీతమ్మ దొడ్లో స్నానం చేస్తూ ఆపాట వింది. ఆ హరిదాసు తనను చూచాడేమో అని తలచి, వానిని నాలుగుతిట్టి వెడలగొట్టింది.

ఏ పాపం ఎరుగని హరిదాసు ఇంకో యింటికి వెళ్లాడు.

అక్కడ,

"నిలువబోదు ఈ జీవమిక" అని తత్వంపాట ప్రారంభించాడు.

ఆ ఇంటి యజమానికి చాలా జబ్బుగావుండెను. ఆ ఇంటివారు ఈ దాసరిపాట వినగానే కర్రలు పట్టుకొని వాణ్ని నాలుగు కొట్టి పంపారు.

మన హరిదాసు, పాపం "హరి హరీ" అంటూ ఇంకో ఇంటికి బిక్షానికి వెళ్ళాడు. ఆ ఇంటిముందర ఇంకో పాట—

"అందమెందుకే ఓ మనసా?" అని సంగీతం మొదలెట్టాడు.

ఆ ఇంటికోడలు అద్దం పెట్టుకొని తల దువ్వుకుంటూ యీ పాట వింది. తననే పరిహాసం చేస్తున్నాడనుకొని, వెంటనే ఒక చీపురుకట్టతో ఆ హరిదాసుని మోదింది.

పిల్లిశకునం జ్ఞాపకంవచ్చి ఆ హరిదాసు తిన్నగా ఇంటికి వచ్చేశాడు.

# పిల్లి వేట!



పిల్లి తరుముతోంది!
కోళ్లు పరుగెత్తుతున్నాయి. మూడు
కోడిపిల్లలు దాగున్నాయి. వెతకండి.

---

'బాల' ఏడాది పుట్టినరోజు సంచిక ఎంతో సొగసుగా ఎన్నో రంగుల బొమ్మలతో, కథలతో, వింతలతో, వినోదాలతో పెద్ద పుస్తకం తయారవుతోంది. ముందుగానే మీ వూళ్ళో ఏజంటుతో మీకో సంచిక తెప్పించమని చెప్పండి. ఆలశ్యం ఆశాభంగం!

కథ:

# తాతయ్య తీర్పు

రచన: రామం

అనగా అనగా ఒక వూళ్లో 'బాల' అనే అబ్బాయి వుండేవాడు. బాలకి తండ్రి లేడు. బాల తల్లి పేరు సీతమ్మ. పాపం వాళ్లు చాలా బీదవాళ్లు. ఉండేందుకు ఇల్లుకూడా లేదు వాళ్లకి. అంచేత వాళ్లు మంగమ్మ అన్న ఒక ఆవిడ ఇంట్లో వుండేవారు. మంగమ్మకి దిక్కు ఎవ్వరూ లేరు. మంగమ్మకి బాలంటే చాల ఇష్టం. సీతమ్మా, మంగమ్మా బాలనిసమానంగా ముద్దుగా చూసేవారు. బాల తల్లి సీతమ్మో, మంగమ్మో తెలిసేది కాదు ఆ వూళ్లోవారికి.

ఒకనాడు ఆ వూరికి ఒక సాధువు వచ్చాడు. ఆ సాధువు మంగమ్మ ఇంటికివచ్చి గుమ్మంలో కూర్చున్న బాలని 'నువ్వెవరవు' అని అడిగాడు. నేను 'బీద బాలని' అని బాల చెప్పాడు. సాధువుకి బాలమీద జాలివేసి బాల చెయ్యి చూశాడు. బాల చెయ్యి చూసి ఆశ్చర్యపోయాడా సాధువు. "నువ్వు చాల గొప్పవాడివై మీ అమ్మని సుఖపెడ్తావు," అని బాలతో అన్నాడు. సాధువు మాటలు విని సీతమ్మ చాలా సంతోషించింది. మంగమ్మ కూడా ఆ మాటలు విని సంతోషించింది కాని బాల తల్లి తాను కానందుకు విచారించింది. సీతమ్మని ఇంట్లోంచి గెంటేసి బాలని తన ఇంట్లో వుంచివేసుకోవాలని మంగమ్మ అనుకుంది.

ఒకనాడు మంగమ్మ సీతమ్మని తన ఇంట్లోంచి పొమ్మంది. సీతమ్మ ఏడ్చింది. పాపం ఏం చేస్తుంది? మూట చంకన పెట్టుకొని బాలని తనతో రమ్మంది. మంగమ్మ బాలని వెళ్లొద్దంది. బాల నా కొడుకని సీతమ్మ అంది. బాల నా కొడుకే అని మంగమ్మ గట్టిగా అంది. ఆవిధంగా సీతమ్మా,

మంగమ్మా కొంచెంసేపు వాదించుకున్నారు. వారి దెబ్బలాట అక్కడున్న వారెవ్వరూ తీర్చలేక పోయారు. అప్పుడు సీతమ్మా, మంగమ్మా, బాలా ఆ వూరి చివర, చెట్టు క్రింద వుండే తాతయ్య దగ్గరకి వెళ్లారు. ఆ తాతయ్య తీర్పులు బాగా చెప్తాడని పేరు. అందుచేత తాతయ్య బీదవాడైనా తాతయ్యంటే అందరికీ గౌరవము. తాతయ్య సీతమ్మ వాదనా మంగమ్మ వాదనా (తాపీగా) విని, బాలని తన దగ్గిరికి రమ్మన్నాడు. అప్పుడు తాతయ్య ఏం తీర్పు చెప్పాడో చెప్పుకోగలరా? ఆలోచించండి.

బాలని తన దగ్గర కూర్చోపెట్టుకొని తాతయ్య సీతమ్మనీ, మంగమ్మనీ తన దగ్గరకి రమ్మన్నాడు. బాలని ఎవరికి వీలైతే వాళ్ళు లాక్కుపొమ్మని వాళ్ళిద్దరితోనూ చెప్పాడు. సీతమ్మా, మంగమ్మా బాలని చెరో రెక్కా పట్టుకొని లాగడం మొదలు పెట్టారు. పాపం బాలకి చేతులు నొప్పిపెట్టాయి. గట్టిగా బాల ఏడ్చాడు. బాల ఏడ్పు చూడలేక సీతమ్మ బాల చేతిని వదిలేసింది. బాల తనకి దక్కాడని మంగమ్మ పొంగిపోయింది. కాని ఇంతలో తాతయ్యను "బాల సీతమ్మ కొడుకే" అని గట్టిగా చెప్పాడు. అందరూ ఆశ్చర్యపోయారు.

"బాల తల్లి సీతమ్మ కాబట్టే బాల ఏడ్చినపుడు వాడి ఏడుపు చూడలేక బాల చెయ్యొదిలింది. మంగమ్మకి బాల కన్నకొడుకు కాదు. కాబట్టి బాలమీద సీతమ్మకున్నంత ప్రేమలేదు. అందుచేత బాల బాధ మంగమ్మ దెబ్బలాటకి అడ్డు రాలేదు." అని తాతయ్య తన తీర్పుని అందరికీ చెప్పాడు. అందరూ తాతయ్య తెలివికి మెచ్చుకొని మంగమ్మని తిట్టి వెళ్ళిపోయాడు. బాల వాళ్లమ్మ దగ్గరికే వెళ్ళాడు.

కథ కంచికి వెళ్ళింది.

మనం ఇంటికివచ్చాం.

# "గోపాల బాల" — తన కథ

నా పేరు బాల. మాఅమ్మ పేరు యశోద. మా నాన్న పేరు నందుడు. మావూరు రేపల్లె. మా వూరిలోని బాలురకు నాకు ఆవులను మేపుట బలే సరద. మా నాన్న పేరట 'నందనవనము' అని ఒక తోటవుంది.

మా రేపల్లెలోని బాలులందరు ఒక బాలసంఘంగా ఏర్పడి, దానికి నన్ను నాయకునిగా జేశారు. రోజూ మేమందరము ఆవులను మేపుటకై నందనవనమునకు వెళ్ళేవారము. ఆ వనము అనేక విధములైన చెట్లతోనూ, తీగలతోను, పువ్వులు కాయలతోను నిండివుంది.

నే నచ్చట పిల్లనగ్రోవి వూదుచు, గోవులను కాయుటచే, మా వూరిలోని వారందరు 'బాలగోపాల' అనియు 'వేణుగోపాల' అనియు నన్ను పిలచేవారు. నేను వేణు వూదునపుడు గడ్డిమేసే ఆవులు నాపాట విని తోకలెత్తుకొని నా వద్దకు పరుగులెత్తుకొని వచ్చేవి. చిలుకలు, కోయిలలు, పాటలు పాడేవి. గోవులను కాసే గోపాలులందరు కోలాటమాడేవారు. నెమళ్లు ఆటలు ఆడేవి. కోతులు గంతులువేసేవి. మా బాలసంఘముయొక్క ఆటపాటలకు దేవతలు మెచ్చేవారు. వనదేవత మాపై పూలవర్షము కురిపించేది. ఈ విధముగా రోజు మేము ఆ వనములో కాలము గడిపేవారము. బాలసంఘం అంటే ఏమనుకున్నారు ?


మా ఆవులు బాగా మేసి మాకు కావలసినన్ని త్రాగుటకు పాలు పెరుగు ఇచ్చేవి. మేము రోజు వెన్నకూడా బాగా తినేవారము.

మా వనముదగ్గర ఒక పెద్ద చెఱువువుంది. దానిలో పెద్ద పామువుంది. దానిపేరు కాళింగి. అది రోజు ఆ చెరువులోనికి నీళ్లు త్రాగుటకు వచ్చేవారిని చంపి తినేది. ఒకరోజున మా ఆటపాటల ధ్వని విని, మమ్ములను

రచన: బొలిశెట్టి నారాయణమూర్తిగుప్త, టీచరు: ధూళిపూడి.

చంపుటకై ఆపాము నీటిపైకి బుసకొట్టుచు వచ్చింది. దానిని చూడగానే మా వాళ్ళందరకు భయము వేసింది. నాకుమాత్రం కోపమువచ్చి ఒక్క పరుగున వెళ్ళి దానిపైకి దూకినాను. అది నన్ను పట్టుకొని తోకతో మెలపెట్టి, పడగలతో కొట్టింది. నాకు కోపము మరింత హెచ్చింది. దాని దవడల పగులకొట్టాను. అది తన తలలోవున్న విషమంతా కక్కింది. నేను వెంటనే దాని నెత్తిమీదకెక్కి మురళి ఊదుచు ఆటఆడేను. అది నెత్తురుకక్కుచు, నాతో ఓడిపోయి, రక్షింపుమని నన్ను ప్రార్థించింది.

అప్పుడు నాకు జాలివేసింది. నేను దానితో 'ఓ పామా! నీవు ఇక ఎప్పుడు ఈచోట తిరిగే పక్షులకు, జంతువులకు, మనుష్యులకు ఎట్టి అపకారము చేయరాదు! మా బాలలు ఒకప్పుడు చూడక నిన్ను తాకినను వారి జోలికి పోకూడదు! నీవు మాతో స్నేహంగావుంటే మా బాలలు ప్రతిసంవత్సరము నీవుండే పుట్టలో పాలుపోసి నీపొట్ట నింపుతారు. లేకుంటే నిన్ను రాళ్లతోను, కఱ్ఱలతో కొట్టి చంపేస్తారు. మా బాలసంఘం అంటే ఏమనుకున్నావో జాగ్రత్త!' అని చెప్పి దానిని వదలివేశాను.



మా బాలసంఘం నా సాహసానికి మెచ్చి ప్రతి సంవత్సరము శ్రావణ బహుళ అష్టమినాడు నాకు పుట్టినరోజు పండుగ చేస్తారు. దానినే కృష్ణాష్టమి అంటారు.

ఒకరు అక్షరాలతో నాఫోటో తయారుచేసి నాకు పంపించినారు. నాఫోటో ఇచ్చటనున్నది. దానిలో ఏఏ అక్షరాలువున్నవో చెప్పగలరా? ఇక శలవు.

# కకారములతో కథ

కమలా విమలా కలరందు
కాశీ శివునీ - గుడియందు
కిల కిల కూసెడి - కీరములు
కీరములూ మరి - కోయిలలు
కుశలము లడిగెడి - రీతులతో
కూరిమి దెలిపెడి - కంఠముతో
కృష్ణా ! కృష్ణా ! గీతికలన్
కౄరపు లేమిని తొలగింపన్
కెవ్వున ఇంపగు కూతలతో
కేరింతలతో - గుడి నిండె.
కైవారంబులు - చేయుదము
కొమ్మరొ రమ్మిక - పోవుదము.
కోవిల నుండే కమలా రావే !
కౌగిలి కమలతో - విమలా రావే !
కంఠము నెత్తుచు - పాడుదము
కః కిం యోచన - మనకేలా ?

రచన : వి. ఎ. పద్మనాభ శర్మ
భారత విద్యాశాల, బెంగుళూరు.

# నమ్మదగిన విన్నమాట

సంపాదన : జగదీశ్ బాబు (మద్రాసు)

ఎఱ్ఱ రంగును చూస్తే ఈగలకు అమిత భయం.

♦ ♦ ♦

పసుపు రంగు వెలుతురు కండ్లకు చెరుపు.

♦ ♦ ♦

ఊరగాయలో రుచేగాని బలంలేదు.

♦ ♦ ♦

పొట్టికాళ్లు గలవారు చాలాకాలం బ్రతుకుతారు.

♦ ♦ ♦

నాట్యం చేసేవారికి ఆయువు హెచ్చు.

♦ ♦ ♦

చైనావారికి మెదడు పెద్దది.

♦ ♦ ♦


మన అరచేతి పొడుగు, ముఖం పొడుగూ ఒకటే.

♦ ♦ ♦

ఆడపిల్లలకు ఈత త్వరగా వస్తుంది.

♦ ♦ ♦

అమావాస్యముందు క్రాపు చేయించుకుంటే వెంద్రుకలు త్వరగా ఎదుగవు.




రచన: విద్వాన్ చాడ విశ్వేశ్వరరావు, విశారద, వేల్పూరు.

అబ్బాయిలూ! అమ్మాయిలూ.

జాగ్రత్తగా వినండేం! బుల్లి కథ చెబుతాను.

మరి, అనగా అనగా ఓ ఊళ్లో అన్నం రెడ్డి పులగం రెడ్డి అనే అన్నదమ్ములు అరిశెల మడి అనే పొలాన్ని, ఆవడ, అప్పం, అనే యెద్దుల్ని పెట్టుకొని దున్నుకొని బ్రతుకుతూ వుండేవారు.

అలా వుండగా, ఓ రోజుని చల్ది అన్నాలదాకా పొలందున్ని ఆ యెద్దుల్ని పక్కనున్న జంతికల అడవిలోకి మేతకి వదలిపెట్టి తాము యిళ్ళకు అన్నాలికి వెళ్లారు. ఈలోపుగా గారె, బూరె అనే దొంగలిద్దరు, బాగా బలిసి వున్నా యేమో, ఆ యెద్దుల్ని తోలుకు పోయారు. రెడ్లు అన్నాలు తిని వచ్చేటప్పటికి యెద్దులు లేవు. తెగ వెతికారు. యెక్కడా కనబడలేదు. వెదకగా వెదకగా ఓ నేతిఏరు అడ్డం వచ్చింది, ఆ యేరుని అప్పడాల తెప్పల మీఁద దాటి అవతలకు వెళ్లారు.

యేటావతల ఊరు మిఠాయి రాజుగారిది. విసుగెత్తి, రాజుగారితో చెబితే ఎందుకైనా మంచిదని, ఆలోచించి మిఠాయి రాజుగారితో యెడ్లను ఎవరో తోలుకుపోయారని ఫిర్యాదు చేశారు. తన రాజ్యంలో యెంత గొప్ప దొంగతనం యెన్నడూ జరగలేదని వెంటనే వడియం, బొబ్బట్టు

అనే పోలీసులతో దొంగల్ని వెతకి వెంటనే పట్టుకోమని ఆర్డరేశారు రాజావారు.

ఆవేళ ఆవూరు దూళ్ళసంత. రెడ్లు చెప్పిన ఆనమాళ్ల ప్రకారం ఆ వూళ్లోనే గారె, బూరె దొంగలు ఆ యెద్దుల్ని ఇంకొకరికి అమ్ముతుండగా పట్టుకొని మిఠాయి రాజుగారి దగ్గిరికి తీసుకొచ్చారు పోలీసులు!

రాజుగారు వెంటనే కేసు విచారించి దొంగలికి ఉండ్రాళ్లు ఒలిచి బొండన వేయించి పేరిననేత్తో చీలలు బిగించి బాగా మాగిన అరటి పళ్లతో ఆ దవడ ఈ దవడ బాగా వాయించిపంపారు. ఎద్దుల్ని రెడ్లకు యిప్పించేశారు. కథ కంచికి, మనం ఇంటికి.

బావుందా కథ?

మీ బిడ్డ లివర్ అండ్ స్ప్లీను వ్యాధిచే బాధపడుచున్న యెడల వెంటనే

పాత్రుడుగారి

బాలసంజీవిని

యీయండి.

ఇతర మందులన్నిటికన్న ఇది ప్రశస్తమని మీకే తెలియగలదు.

వివరములకు :—

డా॥ పిళ్లా పాపయ్య పాత్రుడు & బ్రదరు,

11. దక్షిణమాడావీధి, మైలాపూరు, మదరాసు.

కుంభకోణం బ్రాంచి :
నెం. 7, సారంగపాణి కోవిల్,
తూర్పువీధి.

తిరుచినాపల్లి బ్రాంచి :
నెం. 15, పుగళై పిళ్ళే వీధి,
తెప్పకొలం.

# గొల్లభామ-గొల్లవాడు

[పా ట క థ]

[గొల్లభామ చల్లకుండ తలమీద పెట్టుకొని సంతకి చల్లమ్మబోతుంది.]

గొల్లభామ : చల్లమ్మా చల్లా!
చల్లమ్మా చల్లా!!

చల్లాలమ్మే గొల్లా భామను
పిల్లల్లారా రారండూ
తల్లుల్లారా రారండూ
చల్లను అమ్మేద కొన రండు

చల్లమ్మా చల్లా!
చల్లమ్మా చల్లా!!

[ఇంతలో త్రోవలో ఒక గొల్లకుఱ్రాడు ఎదురవుతాడు]

గొల్లవాడు : ఏవూరుదానవో - గొల్లభామా!
ఎచ్చటికి వెళ్లెదవు - గొల్లభామా!!

గొల్లభామ : రేపల్లె మావూరు - చిన్నవాడా!
చల్లలమ్మబోతాను - చిన్నవాడా!!

గొల్లవాడు : ఒంటరిగ పోయెదవో - గొల్లభామా!
నీవెంట వచ్చెదను - గొల్లభామా!!

గొల్లభామ : ఒంటరిగ పోగలను - చిన్నవాడా!
నావెంట రావలదు - చిన్నవాడా!!

గొల్లవాడు : అయితే సంతలో—
బేరాలు చేయగలవ - గొల్లభామా!
లాభాలు తీయగలవ - గొల్లభామా!!

గొల్లభామ: బేరాలు చేయగలను - చిన్నవాడా!
లాభాలు తీయగలను - వన్నెకాడా!!

గొల్లవాడు: అయితే మరీ—
వగలాడిదానవో - గొల్లభామా!
(నీకు) నగలేమిలేవేమి - గొల్లభామా!!




గొల్లభామ: నగలేల గిగలేల - వన్నెకాడా!
నామోమె నాసొమ్ము - అందగాడా!
నాసొగసె నాధనము - అందగాడా!!

గొల్లవాడు: ఓహో! అలాగా!
అటులైన నినుమోలె - గొల్లభామా!
నినుపెండ్లి చేసుకోను - గొల్లభామా!!

గొల్లభామ: నిన్నెవరు అడిగేరు - చిన్నవాడా!
నీదారి పోవోయి - కొంటెగాడా!!

చల్లమ్మా చల్లా!
చల్లమ్మా చల్లా!
(అని పాడుకుంటూ వెళ్లిపోతుంది)




"పన్యాలన్నయ్య"

రాధాయి చాలా చెడ్డవాడు. ఎంత చెడ్డవాడూ అంటే - అంత చెడ్డవాడు. సాధారణంగా తెలివైన వాళ్ళంతా మరి చెడ్డ వాళ్లేగా! నాన్నగారంటే రాధాయికి కొంచెం భయంవుంది. ఎంచేతనంటే—నాన్నగారు ఆఫీసుకి వెళ్తారు. ఆఫీసుపని చేస్తూవుంటారు. పెద్ద పెద్ద వాళ్లతోతిరుగుతారు. పెద్ద పెద్ద వాళ్లంతా నాన్నగారికోసం ఇంటికి వస్తూవుంటారు. అంతే కాకుండా నాన్నగారు పెద్దవారు! చాలా హడావిడిగాకూడా వుంటారు. అంచాతనే, నాన్నగారంటే రాధాయికి ఏదో భయంగా వున్నట్టుంటుంది. అమ్మకూడా నాన్నగారంటే భయపడ్తూ వుంటుంది మరి! నాన్నగారికోసం అని ఎంతో పనిచేస్తుంది.

అమ్మ అంటే తనకు బొత్తిగా భయంలేదు. "తల్లి తండ్రులు దైవసమానులు" అని పాఠం వుంది గాని, రాధాయికి వాళ్ళ అమ్మ ఎప్పుడూ అలాగ తోచనే లేదు. తను ఏమైనాచేస్తే అది వొంకరపని అని అమ్మ రాధాయిని బాదేస్తూ వుంటుంది. అం

దుకే అమ్మ అంటే తనకు భయమన్న మాటలేదు!

నాన్నగారు సిగరెట్టు కాలుస్తూవుంటే మహా బావుంటుంది చూడడానికి. గుప్పుగుప్పుమని రైలింజనునుంచి వచ్చే పొగలాగ, నాన్నగారి నోట్లోంచీ, ముక్కులోంచీ కూడా సిగరెట్టు పొగ గుప్పుగుప్పుమని వస్తుంది. ఎంత బావుంటుంది! నోట్లోంచి పొగ బయటకి రావడం బాగానే వుంది. మరి ముక్కులోంచికూడా ఎలా వస్తుందో! నాన్నగారు సిగరెట్టు కాలుస్తూవుంటే. ప్రక్కన నిల్చుని ఆ పొగచూస్తే రాధాయి కెంతో గమ్మత్తుగా వుంది.

అమ్మకేం తెలీదు. అమ్మకు సిగరెట్టు కాల్చడమే చాతకాదు! పైగా ఆ వాసన అంటే ఎందుకో అమ్మకి వొళ్ళు మండడం. 'సిగరెట్లకని నెలకు పాతికో ముప్ఫయ్యో తగలేస్తారు' అని నాన్నగారిమీద నోరుచేసుకోవటం రాధాయి చాలాకాలమయి వింటూనే వున్నాడు.

నాన్నగారు అప్పుడే బజారు నుండి వచ్చి కొత్తగా ఒక సిగరెట్టు డబ్బాకూడా తెచ్చారు. తరువాత, ఎన్నో ఏమేమో సామానులు కూడా తెచ్చి అమ్మకిచ్చారు. సిగరెట్టు డబ్బా మాత్రం నాన్నగారు తన టేబిలు డ్రాయరులో దాచటం రాధాయి చూశాడు.

తరువాత నాన్నగారు అమ్మతో ఇల్లా అన్నారు. "చూడూ, మా ఆఫీసరుకి ట్రాన్స్ఫరయిపోందిగా. ఆయన్ని, మరి కొంత మంది స్నేహితుల్ని ఇవాళ సాయంత్రం 'టీ'కి పిల్చాను. మరేంచేస్తావో అల్పాహారాలు!" ఈ మాట రాధాయి విన్నాడు.

"ఏం చేయమన్నారో చెప్పండి!" అన్నది అమ్మ.

"దోసెలు చెయ్యి లేకుంటే ఉప్మాచేసెయ్యి-సులువుగా తేలిపోతుంది. తరువాత కాఫీగుండవుంటే కాఫీ-లేకుంటే టీ" అన్నారు నాన్నగారు. రాధాయి

వెంటనే అమ్మదగ్గరకి వెళ్ళి "అమ్మా! దోసె పొయ్యవే!" అన్నాడు.

"నువ్వు అల్లరిచేస్తే దోసె చెయ్యను మరి!" అన్నది అమ్మ.

"అబ్బే నేనల్లరిచేస్తే అప్పుడు చెప్పు-అసలు నేను నీ జోలికేరాను. నేను మళ్ళీ వచ్చేసరికి మాత్రం నాకు దోసె యివ్వాలి. ఏం?-నేను కచ్చేరీ పని చేసుకుంటాను" అని దర్జాగా రాధాయి వెళ్లిపోయాడు.

బయట నాన్నగారు టేబిలు వేశారు. దానిమీద ఇస్త్రీమడత గుడ్డ వేశారు. ఆగుడ్డమీద అమ్మ రాధాయి పుట్టకముందు మాంచి పువ్వులుకుట్టుంది! టేబిలుమీద ఓగ్లాసుపెట్టి అందులో పువ్వులు పెట్టారు. చుట్టూ అయిదారు కుర్చీలు వేశారు.

"ఒరే రాధాయి! నువ్వు అల్లరిచేసి అవన్నీ పాడుచెయ్యకు. దెబ్బలు తినగలవు" అంటూ నాన్నారు ఎక్కడికో హడావిడిగా వెళ్ళిపోయారు.

రాధాయి కెందుకో కొంచెం కోపంవచ్చింది. ఇప్పుడే అమ్మదగ్గర అల్లరిచేయను అని మాట యిచ్చివచ్చాడు. తను అల్లరి చేస్తున్నట్టే నాన్నగారిల్లా అనే సరికి రాధాయికి వొళ్ళుమండింది.

రాధాయి, నాన్నగారు వెళ్ళి పోవడంచూసి మెల్లగా డ్రాయరు తెరిచాడు. సిగరెట్టు డబ్బా, పక్కనే అగ్గిపెట్టె అగుపించాయి.

సిగరెట్టు డబ్బా మూత తీశాడు రాధాయి. మూత తీయగానే ఏదో గుండ్రని రేకు వూడిపడింది! ఈ రేకు చాలా బావుంది. మధ్య దగ్గరగా రెండు కన్నాలు పొడిచి, వాటిలోంచి ఒక ధారంలాగి, ఇటూ అటూ పట్టిలాగితే ఈ రేకు 'రైఁ-రైఁ' మని తిరుగుతుంది, బావుంది.

సిగరెట్టు డబ్బా దొంగతనంగా కళ్లపడగానే రాధాయికి మాంచి ఆలోచన తోచింది. ఒక సిగరెట్టు తీసిముట్టిస్తే?... నాన్నగారిలాగ గుప్పుగుప్పు మని

పొగ వొదలవచ్చు! ముక్కు నుంచి పొగ తెప్పించాలి! అప్పుడు మజాగా వుంటుంది!

రాధాయి వెంటనే, సిగరెట్టు డబ్బా అగ్గిపెట్టె పట్టుకుని, దొంగ తనంగా పెరట్లో ఒక మూల నక్కి కూర్చున్నాడు. డబ్బా నుంచి ఒక సిగరెట్టుతీసి నోట్లో పెట్టుకున్నాడు. రాధాయి పెదిమలు వొణికాయి! ఆ సిగరెట్టు కిందపడిపోయి, ఎంగిలి అయిన చోట మన్నంటుకుంది. ఛీ అని అది నలిపి పారేసి మరో సిగరెట్టు తీశాడు. అది నోట్లో పెట్టుకుని పెదవులతో గట్టిగా అదిమిపట్టు కున్నాడు. తరువాత అగ్గిపుల్లతీసి వెలిగించాలనుకున్నాడు. అది చప్పున వెలగలేదు. ఆ హడావిడిలో ఆ అగ్గిపుల్లకున్న మందు కాస్తా వూడిపోయింది. మరో అగ్గిపుల్లతీసి వెలిగించాడు. వెధవది! ఈ సిగరెట్టు ముక్కుకి చాలా దగ్గర్లోవుంది! సిగరెట్టు వెలిగిస్తే ఆమంటకి ముక్కు చురుకుతుందేమో! కాని నాన్న గారుమరి అంత ధైర్యగా కాలుస్తారే! సిగరెట్టు ముట్టించాడు రాధాయి. కాని పీల్చడం ఎలాగో చాతకాలేదు. ఊరికే పొగ రావడమేగాని సిగరెట్టు కాలలేదు! అది నోట్లో పెట్టుకుని లోనికి గాలి పీల్చాడు. ఏదో కంపుకొట్టింది! అబ్బ! ఏంకంపు! ఏంబాగాలేదు!

రాధాయి సిగరెట్లతో ఇల్లా బాధలుపడుతూవుండగా నాన్న గారొచ్చిన చప్పుడయింది. నాన్న గారితోకూడా మరెవరో నలుగురైదుగురు కూడా వొచ్చారు!

రాధాయికి ఇంతవరకూ లేని భయం ఒకటి పట్టుకుంది. దొంగ దొరికిపోతే! నాన్నగారు చావ బాదేస్తారో ఏమో!

రాధాయి నాన్నగారు అమ్మ దగ్గరకువెళ్ళి—"ఏమోయి అంతా వచ్చారు—టిఫిను తయారు అయిందా" అనటం విన్నాడు రాధాయి.

మళ్లీ అటు వినటమే మానేశాడు రాధాయి. కొంత సేపటికి నాన్నగారూ, ఆయన స్నేహి

తులూ ఫలహారాలు చేస్తున్న చప్పుడు వినపడింది.

నాన్నగారు చప్పున లేచి డ్రాయరు చప్పుడు చేశారు.

"ఏమోయి-ఇందులో కొత్త సిగరెట్టు టిన్ను పెట్టాను చూశావా?" రాధాయి వింటున్నాడు. వాడి చిన్న గుండె తీవ్రంగా కొట్టుకొంటోంది!

"లేదండీ! ఎప్పుడు తెచ్చి అందులో వుంచారు?"

"ఇందాకనే తెచ్చానులే! ఎక్కడా కనపడటంలేదు.

ఏడీ రాధాయిగాడేడీ! వాడు తీశాడేమో!"

"వాడికెందుకండీ మీ ఫాడు సిగరెట్టు డబ్బా!"

అమ్మ చాలా మంచిది! దైవ సమానురాలు అన్న పాఠం బాగా చదువుదాం అనుకుని తీర్మానించుకున్నాడు రాధాయి.

"లేకుంటే ఎలా మాయమవుతుందని! అసలు వాడేడీ? ఇంట్లో వుండక ఎక్కడికి పోయాడు?" అని కేకలు వేస్తున్నారు నాన్నగారు.

"ఏమో నాకు తెలీదండీ. బయట ఎక్కడో ఆడుకుంటున్నాడు." అన్నది అమ్మ!

"అదిగో! ఎక్కడో సిగరెట్టు వాసనకూడా వస్తోంది. ఆ వెధవాయిగాని కాలుస్తున్నాడా ఏమిటి?" అంటూ నాన్నగారు గది కిటికీలోంచి తొంగిచూశారు.

సిగరెట్లు కాలుతూ కాలుతూ పొగవస్తున్నాయి. ఒక కుప్పగా వున్నాయి. నాన్నగారు పరుగెత్తుకుని పెరట్లోకి వచ్చారు. పెరట్లో వోమూలని సిగరెట్టు డబ్బా, అగ్గిపెట్టె పడివున్నాయి - కొన్ని సిగరెట్లు కాలుతున్నాయి కింద-రాధాయిమట్టుకు లేడు!

సిగరెట్టు డబ్బాలో ఏవో కొద్దిగా మాత్రం వున్నాయి స్వస్వరూపాలతో! తతిమ్మావి సగం సగం తుంచివున్నాయి. అగ్గిపెట్టెలో పుల్లలే లేవు!

"ఇదిగోనండి రాధాయి— ఎందుకూ అలా వెతుకుతారు వాడికోసం?" అన్నది అమ్మ. ఊరుకున్న బాగుణ్ణు!

రాధాయి అమ్మదగ్గర నక్కి కూర్చున్నాడు ఏమీ ఎరగని వాడిలాగ. నాన్నగారు గబగబా వచ్చారు.

"ఏంరా? ఈ సిగరెట్టు నువ్వేనా తగలపెట్టావు?"

రాధాయి నోరు కదల్పలేదు.

"వాడికెందుకండీ సిగరెట్టు—మీకు మతిపోయిందా యేమిటి?" అన్నది అమ్మ.

"నీకే మతి పోయింది—చూడు ఎలాచేశాడో వెధవాయి. ఏదీ నోరు తెరూ" అని నాన్నారు రాధాయి తల ఆడించారు. రాధాయి నోట్లోంచి సిగరెట్టు వాసన గుప్పుమంది!

"చూడు—వాడి నోరేం వాసనో!"

ఈసారి అమ్మకూడా ఆశ్చర్యపోయింది.

"ఓరి భడవా! ఏంపనిరాయిది!" అని అమ్మ చెయ్యెత్తింది. నాన్నగారు అడ్డొచ్చారు. కొట్టనియ్యలేదు.


"మీరు వాణ్ణి మరీ నెత్తికెక్కించుకోండి. మీవల్లనే వాడు పాడయిపోతున్నాడు. మీ సిగరెట్టువల్లనే ఇవాళ వాడింతపని చేశాడు" అని అమ్మ కేకలు వేసింది.

"పోనిస్తు—కేకలు వెయ్యకు వాళ్లంతా నవ్వుతారు వింటే—ఒరే వెధవాయి — మరెప్పుడూ ఇలాంటి పనులు చేయను అను" అన్నారు నాన్నారు.

"చే-య-ను" అనేమాటలు రాధాయి నోటినుండి రావటం చాలా కష్టమయింది.

"ఛా — దొంగవెధవా — నీకు దోసెలేదు ఏంలేదు-ఫో" అంది అమ్మ. రాధాయి మిణుకూ మిణుకూ అమ్మకేసి చూస్తు ఇంకా కూర్చునే వున్నాడు... దోసెకోసం!





# కుక్క తోక కథ

రచన: యం. విష్ణుప్రియ కనకరత్న కుసుమకుమారి

★

అనగా అనగా ఒక ముని వుండేవాడు. ఆ ముని శివునిగురించి తపస్సు చేశాడు. శివుడు ఆతని తపస్సునకు మెచ్చి ప్రత్యక్షమయ్యాడు. "నీకేమి కావాలో కోరుకో" అన్నాడు.

అప్పుడు ఆముని : "నేను ఏపని చెప్తే ఆపనిచేసే ఒక బంటు కావాలి" అని అన్నాడు.

అప్పుడు శివుడు ఒక రాక్షసుడిని పిలిచి, "రాక్షసుడా! నీవు యీ ముని ఏపని చెబితే ఆపని చెయ్యాలి"-అని ఆజ్ఞాపించేడు.

అప్పుడు రాక్షసుడు అన్నాడు: "ఈశ్వరా! ఈముని నాకు ఎల్లప్పుడు పనులు చెబితే సరే, పని చెప్పకపోతే ఈ మునిని మ్రింగేస్తాను!-" అన్నాడు.

"సరే అలాగే" అని ముని ఒప్పుకున్నాడు.

ముని, రాక్షసుడిని అడవులు నఱకమన్నాడు.

రాక్షసుడు ఆపని చేశాడు.

సముద్రంలోని నీరంతా తోడమన్నాడు.

ఆ పనికూడా చేశాడు...

ఇంకా ఎన్నెన్నో పనులు ముని చెప్పాడు. అన్నిపనులూ రాక్షసుడు చేశాడు.

ఇంక ఏమీ పనులు లేవు! రాక్షసుడు మ్రింగేస్తాడేమో అని ముని ఏడుస్తూ కూర్చున్నాడు.

ఇంతట్లోకీ ఆ మునియొక్క స్నేహితుడు అక్కడికి వచ్చాడు. "ఎందుకు ఏడుస్తున్నావ్?" అని అడిగాడు.

ముని, జరిగినదంతా చెప్పాడు. "అన్నిపనులూ చెప్పేశాను. ఇంక ఏపని చెప్పడానికీ తోచలేదు. ఇప్పుడు యీ రాక్షసుడు

వన్ను చంపేస్తాడు. ఎలాగ?'' అని ఏడ్చాడు.

అప్పుడా స్నేహితుడు : "ఓరి వెఱ్ఱివాడ! ఇంతేనా? ఆ రాక్షసుడికి కుక్కతోకను తిన్నగా చేయమని పని చెప్పు—'' అని సలహా ఇచ్చాడు.

రాక్షసుడు రాగానే ముని ఒక కుక్కను తెచ్చి, "రాక్షసుడా! ఈ కుక్కతోక వంకరగా వుంది. దీనిని తిన్నగా చేయుము'' —అని చెప్పాడు.

రాక్షసుడు ఆ కుక్కతోక పట్టుకొని గట్టిగాలాగి తిన్నగా చేయడానికి ప్రయత్నించాడు. ఎన్నిసార్లు లాగినా కుక్కతోక కుక్కతోకే! మళ్ళీ వంకరగా అయిపోయేది.

రాక్షసుడికి విసుగెత్తింది. "బాబోయ్! ఈపని నా చేత కాదు కదా, దీన్ని పుట్టించిన బ్రహ్మ తరమా?'' అంటూ అక్కడినుంచి పారిపోయాడు—

కథ కంచికెళ్ళింది.


# అందచందాలు

● ఇంటికి పాపాయి అందం

● కంటికి కాటుక అందం

● అన్ని అందాలకు మించినది

● ముఖానికి కలరు కుంకుమ.

ఆ- కలరు కుంకుమ

తయారుచేయు చోటు ఏది?

టి. గురుస్వామి శెట్టి

144, ఆదియప్పనాయక్ వీధి, జి. టి. మదరాసు.

# ఆకాశ కుటుంబం

రచన: శ్రీ రామశాస్త్రి.

అనగా, అనగా ఓ ఊళ్లో చాలామంది పిల్లలున్నారు. వాళ్లు రోజూ అంతా కలిసి కొండమీద, అంటే ఆకాశం మీద ఆడుకుంటూండేవారు. వాళ్లలో సూర్యుడనే అబ్బాయి కొంచం పెద్ద. ఇంకా చంద్రుడు, నక్షత్రాలూ, మేఘాలూ ను వాళ్ళ పేర్లు.

వాళ్ళంతా కోతి కొమ్మచ్చి, ఉప్పట్టి, అవీ ఆడుకునేవారు. ఓ నాడు వాళ్ళు భూమిమీదకి, అంటే నదులూ, పర్వతాలూ, చెరువులూ, చెట్లూ, తోటలూ అవీ ఉండే చోటికి వచ్చారు అంతా కలిసి ఆడుకుంటూను. ఆపళంగా ఓ చెరువులో తామర పువ్వులు, కలవపువ్వులూ చూశారు. అవి కొత్తగా అందంగా ఉన్న మూలాని, మీలాగే, సూర్యుడు తామరపువ్వులు నాకు, అన్నాడు. చంద్రుడు కలవపువ్వులు నాకు, అన్నాడు సంతోషంతోటి. అంచేత అప్పటినుంచీ సూర్యుడు తామర పువ్వులతోటీ, చంద్రుడు కలవ పువ్వులతోటీ జతకట్టారు. చంద్రుడు కనబడగానే కలవపువ్వులకీ, సూర్యుడు కనబడితే తామర పువ్వులకీ చాలా సరదా.

వీళ్ళు రోజూ కొండమీద ఆడుకుంటూండేవారు. ఓనాడు సూర్యుడికీ, చంద్రుడికీ దెబ్బలాట వచ్చింది. రెండు జట్లుల కింద విడిపోయారు. పెద్దవాడు గనక సూర్యుడొక్కడూ ఒకటి. చంద్రుడూ నక్షత్రాలూ ఒకటి మేఘాలు మాత్రం ఇద్దరితోటీ మాటాడుతూండేవి. అప్పటినుంచీ రెండు జట్లులవాళ్ళూ కోపం మూలాని ఓసారి ఎప్పుడూ కలిసి ఆడుకోరు. చంద్రుడు జట్టు వాళ్లుంటే సూర్యుడు రాడు, సూర్యుడు కొండమీద ఆడుకునేప్పుడు చంద్రుడుపార్టీవాళ్లురారు.

అసలు చంద్రుడు ఆడుకోడానికి వెడతానంటే వాళ్లమ్మా నానా ఒప్పుకోరు; మళ్ళీ దెబ్బలాడుకుంటారేమో, కుర్రాణ్ణిచేసి

కొడతారేమో అనే భయంచేత. అందుకే ఒక్కొక్కప్పుడు చంద్రుడు లేకుండా నక్షత్రాలొకళే ఆడుకుంటాయి.

చంద్రుడు వాళ్ళమ్మవాళ్ళూ చూడకుండా వచ్చి కొంచంసే పాడుకుని వెళ్ళిపోతాడు; ఒక్కొక్కప్పుడు ఆలస్యంగా ఒస్తాడు; ఒక్కొక్కప్పు డసలే రాడు కొండ మీాద ఆడుకోడానికి.

సూర్యుడూ చంద్రుడూ దెబ్బలాడుకున్న సంగతి తామరపువ్వులకీ కలవపువ్వులకీ ఎవరు చెప్పారో కాని తెలిసింది. బహుశా మేఘాలే, ఇద్దరి జతాకూడా కనక, ఏవాన కురిసేటపుడో మెల్లిగా చెప్పేసి ఉంటాయి. అంచేతనే సూర్యుడు రాగానే సంతోషంతోటి విడిచి నవ్వుతూ తామరపువ్వు లుంటాయి; మొఖం ముణుచుకుని కోపంగా కలవపువ్వులుంటాయి. అలాగే చంద్రుడొచ్చినప్పుడూ, చంద్రుడు స్నేహితులు నక్షత్రాలొచ్చినపుడూ తామరపువ్వులు ముఖం ముణుచుకుంటాయి; కలవపువ్వులు నవ్వుతూంటాయి.

సూర్యుడికి ఓయేడాది సెలవ లుంటాయి. ఆ సెలవల్లో అతను వాళ్ల చుట్టాలందరిళ్ళకీ వెడతాడు. రెండేసి నెల్లు ఒక్కొక్కళ్ళింటో ఉంటాడు. చూడండి ఇప్పుడు కొంతమంది ఇళ్లకి, బృందావనం, శాంతి సౌధం, ఆనందకుటీరం, అని పేర్లు పెట్టుకుంటారు. అలాగే సూర్యుడు చుట్టాల ఇళ్లకి వసంతం, గ్రీష్మం, వర్షం, శరత్తు, హేమవంతం, శిశిరం, అని పేర్లు. సూర్యుడొక్కొక్క ఇంట్లో రెండేసి నెల్లుంటాడు. అంటే చైత్ర వైశాఖాలు 'వసంతం' లోనూ, జ్యేష్ఠాషాఢాలు గ్రీష్మం లోను ఇలాగే సంవత్సరం సెలవలూ ఆరుగురు చుట్టాల ఇళ్లల్లోనూ ఉంటాడు.

వీళ్ళాడుకునేప్పుడు, రాహువు కేతువు అనే ఇద్దరు బండపిల్లలున్నారు - వాళ్ళు సూర్యుణ్నోసారి చంద్రుణ్నోసారి ఒకళ్ళూ ఉండగాచూసి, లాక్కుపోతారు. అయినా వాళ్ళ నాన్నకీ అమ్మకీ తెలిస్తే కొడతారేమో అని భయంచేత మళ్లీ కాస్సేపటికి ఒదిలేస్తారు. ఇప్పటికీ వాళ్ళలా దెబ్బలాటలతోటీ, కోపాలతోటీ, భయంతోటీ, ఆకాశంమీాద ఆడుకొంటూనే ఉన్నారు.

# ముసలమ్మ యుక్తి

రచన :
ముళ్లపూడి
వెంకటరమణ
(కేసరీ స్కూలు)

ఒకవూళ్ళో ఒక ముసలమ్మ ఉండేది. పాపం, ఆ ముసలమ్మకి కొడుకులూ, బంధువులూ ఎవ్వరూ లేరు. ఎప్పుడూ ఒక రాట్నం పెట్టుకుని దారంతీస్తూ ఉండేది. ఇలా వుండగా ఒకనాటి రాత్రి ఆ అవ్వ నిద్రబోతూవుంటే, దొంగలు కన్నం తవ్వేరు. ఇంక లోపలికి ఒస్తారనగా, అవ్వకి తెలివొచ్చి, లేచి కూర్చుంది. కూర్చుంటే, కన్నంలో దొంగలు కనపడ్డారు. అప్పుడు, తన ఇంట్లో ఎవరు సాయం లేని మూలాన్ని ఒక ఉపాయం పన్నింది. ఏమీ ఎరగనట్లు తన రాట్నం ముందర పెట్టుకొని, దారంతీస్తూ, కొడుకులు లేకపోయినా పిల్చినట్లు నటిస్తూ, మళ్ళీ వాళ్ళు సమాధానం చెప్తూన్నట్లు తన గొంతుక మార్చుకొంటూ,

ముద్దుల మువ్వన్నా! లేరా నా కొడకా!
ఊ! ఆ! లేచానోయమ్మా!
గంటల కావన్నా! లేరా నా కొడకా!
ఊ! ఆ! లేచానోయమ్మా!
పచ్చని బసవన్నా! లేరా నా కొడకా!
ఊ! ఆ! లేచానోయమ్మా!
వెంకటగిరి రామా! లేరా నా కొడకా!
ఊ! ఆ! లేచానోయమ్మా!

అని పాడింది.

అప్పుడేమైందంటే, అయ్యో అవ్వకి నలుగురు కొడుకుల్లా వుంది. వాళ్లు లేచారంటే మనం దొరికిపోతామని భయపడి దొంగలు పారిపోయారు. తనయుక్తి బాగా పారినందుకు ముసలమ్మ చాలా సంతోషించింది.

వెన్న ముద్ద
చిన్నికృష్ణుడికి
ఎంతో ఇష్టం....
మీకూ ఇష్టమే!



* * *

మీ అమ్మ
గోరు గోరు బువ్వ
గుజ్జు గుజ్జు బువ్వ
కలిపినపుడు
చక్కని వెన్నకాచిన
నెయ్యితో కలిపితేనే
మీరు తినే పప్పుబువ్వ
ఘుమఘుమలాడుతూ
కమ్మగా ఉంటుంది.

* * *

మంచి వెన్నా, నెయ్యీ ఎక్కడ దొరుకుతుందో తెలుసా?

ఇక్కడ:

## బి. వి. రావు & కో

వెన్న, నెయ్యి వ్యాపారస్తులు

136, పరశువాకం హైరోడు, మదరాసు.

Phone No. 4002

బ్రాంచీలు
1/7 F దక్షిణ మాడవీధి,
మైలాపూరు
57, బిగ్ స్ట్రీటు
ట్రిప్లికేను.

నా పేరు

# లవణం

నన్ను మొదట మా నాన్న గారు స్కూలులో వేశారు. స్కూలులో మొదటిరోజున అందరూ 'నీ పేరేమిటి?' అని నన్ను అడిగారు. అపుడు నేను 'నా పేరు లవణం' అన్నా. అందరూ నా పేరు గమ్మత్తుగా యుందని వెక్కిరించడం మొదలుపెట్టారు. నేను వెళ్ళి మా మేష్టరుగారితో జరిగిన సంగతంతా చెపితే ఇలా అన్నారు:—

'ఒరేయి పిల్లల్లారా! మీరు ఈ అబ్బాయిని ఏడిపించి వెక్కిరిస్తున్నారు ఎందుకు? అతనిపేరు బాగుండలేదనేనా? మీ పేర్లు బాగున్నాయా? పుల్లయ్య, ఎల్లయ్య, ఎంకయ్య, నల్లయ్య అని. మీ రెప్పుడూ ఒకరిపేరు విని వారిని వెక్కిరించకూడదు.

పూర్వం ఒక అబ్బాయిపేరు విచిత్రంగా యుండేది. అది చూచి అందరూ వెక్కిరించేవారు. అపుడు ఈపేరు బాగులేదు ఏదయినా మంచిపేరు వెదుకుదాం అని తిరగటం మొదలెట్టేడు.

అలా కొంతదూరంపోగా ఒక శవాన్ని మోసుకువెళ్ళడం చూచి 'ఈ చనిపోయిన వాని పేరేమి?' అని అడిగాడు. 'అమర్ నాథ్' అని వారు జవాబు ఇచ్చారు.

ఇంకా కొంతదూరం పోగా ఒక గ్రుడ్డి ముసలమ్మని ఒక అబ్బాయి చెయ్యిపుచ్చుకుని తీసుకెళుతున్నాడు. అది చూచి ఆ ముసలమ్మ పేరేంటి అన్నాడు. 'కమలనయన' అని జవాబిచ్చారు.

ఇంకా కొంచెందూరం వెళ్ళేడు. ఒక ముష్టివాడు కనపడ్డాడు. 'నీ పేరేంటి' అని అడిగాడు. 'కుబేరుడు' అని జవాబిచ్చాడు.

ఇక ఆ కుర్రవాడు ఆలోచించడం మొదలుపెట్టాడు. అమరనాథుడు చచ్చిపోతున్నాడు, కమలనయనకు కళ్ళులేవు. కుబేరుడు ముష్టి ఎత్తుకుంటున్నాడు. అలాంటప్పుడు పేరులో యేముంది?' అని అనుకుని తన పేరు కూడా బాగుందని, తన పేరే యుంచుకున్నాడు.

అలాగ మీరంతా పేరు ఏదైనా అతనుచేసే పనిని చూడాలిగాని అతని పేరునుచూచి వెక్కిరించకూడదు.''

రచన: లవణం, ముదునూరు.

# వెక్కిరింపు

నా పేరు రామం. మా బడిలో నన్ను "రామీ", "గీమీ" అని వెక్కిరించి ఏడిపిస్తారు.

నాకు ఏడుపొచ్చి, ఇంటికి వెళ్ళి ఏడ్చాను. అమ్మ అడిగింది ఎందుకు ఏడుస్తున్నావ్ ? - అని. ఇంకా ఏడుపు వచ్చింది. మా నాన్నకూడా వచ్చారు. నాకు బిస్కట్లు ఇచ్చారు. "ఎందుకు ఏడుస్తావు ?" అని అడిగారు.

"నాకు రామంపేరు వద్దు. బడిలో అందరూ వెక్కిరిస్తున్నారు." అన్నాను.

"నువ్వు శ్రీరామనవమినాడు పుట్టేవు. నీ పేరు దేముడిపేరు. తెలిసిందా! ఏడవకు." అన్నారు.

నేను బడికి వెళ్లాను.

బడిపిల్లలు వెక్కిరించారు.

"నన్ను వెక్కిరిస్తే దేముడ్ని వెక్కిరించినట్టే తెలుసా ?"— అన్నాను.

అందరూ వెక్కిరించడం మానేశారు.

శ్రీరామనవమినాడు నా పుట్టినరోజు పండగ మా అమ్మ బాగా చేసింది.

రచన: ఎస్. ఎన్. ఆర్.
(బొండాడ)

# పాపాయి పడింది!

"నాన్నా! పాపాయి పడింది!"

"దెబ్బ తగిలిందా !"

"దెబ్బ తగలడం ఏమిటి నాన్నా ! పాపాయి పడింది."

"పడితే దెబ్బతగలదూ ?"

"అదికాదు. నువ్వు పాపాయి ఫోటో "బాల"కు పంపించావు. అది పడింది."

"పెంకిబడవా! ఇదా గమ్మత్తు !

* * *

"నాన్నా ! అక్క పడింది చూచావా ?"

"అక్క ఫోటోకూడా పడిందా ? ఏదీ ?"

"అదికాదు నాన్నా ! అక్క కాలుజారి కింద పడింది!"

రచన: ఎం. విమలాదేవి.
(రామూరు)


# ఆరోగ్య వాచకము

[మొదటి తరగతి]

## ఆటలు

హాయి! హాయి! ఆటలు
ఆడుకొందమాటలు
బయలులోని ఆటలు
సాయంకాలం ఆటలు
గాలిలోని ఆటలు
మేలుచేయు ఆటలు






1. కాకి ఆట:

కాకీ! కాకీ! కావు! కావు!
కావు! కావు! కావు! కావు!
కావు! కావు! కావు! కావు!
కావు! కావు! కావు! కావు!

పిల్లలు పాడుచూ, పరుగెత్తుతూ రెండుచేతులూచాచి, కుడిచేయి క్రిందికి ఎడమచేయి మీదికి, ఎడమచేయి క్రిందికి, కుడిచేయి మీదికి ఆడించవలెను. పాట ముగియగానే ఆట చాలించవలెను.

2. బాతు ఆట:



బాతూ! బాతూ! బాక్! బాక్!
బాక్! బాక్! బాక్! బాక్!
బాక్! బాక్! బాక్! బాక్!
బాక్! బాక్! బాక్! బాక్!

బొత్తుగా కూర్చొని, కాలిమడమలపై చేతులుంచుకొని నడువవలెను.



రచయిత:

డాక్టరు పోలాకి శ్రీనివాసరావు,
బూరవెల్లి - చికాకోల్.

[అన్నిహక్కులూ రచయితవి]

# "జీర్ణం! జీర్ణం! వాతాపి జీర్ణం!"

జి. వి. రమణయ్యబాబు, [కవితాసమితి] అనకాపల్లి.

అనగా అనగా ఒకరాక్షసుడు. అతనిపేరు వాతాపి. అతనికొక అన్నదమ్ముడు ఉండేవాడు. ఆ రాక్షసునిపేరు ఇల్వలుడు.

ఒకనాడు ఇల్వలుడు ఒక బ్రాహ్మణుని దగ్గరకువెళ్ళి తనకు యీ ప్రపంచమంతా వశీకరమై, సిద్ధించే మంత్రము చెప్పమని అడిగాడు. కాని ఆ బ్రాహ్మణుడు చెప్పనన్నాడు. ఈ కోపముచేత అప్పటినుంచి బ్రాహ్మణులను చంపడం ప్రారంభించారు యీ యిద్దరు రాక్షసులు. తరుచుగా బ్రాహ్మణులను యీ రాక్షసుల యింటికి భోజనానికి రమ్మని పిలిచేవారు. వాతాపి కామరూపుడు. అంటే, వాతాపి ఏ రూపము కావలస్తే ఆ రూపమే అయిపోయేవాడన్నమాట. బ్రాహ్మణులు యీ రాక్షసుల యింటికి భోజనానికి రాగానే వాతాపి మేకపిల్లలాగ అయిపోయేవాడు. వాతాపి సోదరుడు యిల్వలుడు ఆ మేకపిల్లను కోసి వంటచేసి ఆ బ్రాహ్మణులకు భోజనము పెట్టేవాడు. ఆ రోజులలో బ్రాహ్మణులుకూడా చేపలు-మాంసము తినేవారట! ఇప్పటికి మన హిందూదేశములో కొన్ని ప్రాంతాల్లో బ్రాహ్మణులు మాంసము - చేపలు తింటారు. ముఖ్యముగా మన తెలుగుదేశము ప్రక్కనేయున్న ఓఢ్ర దేశములో బంగాళా దేశములో బ్రాహ్మణులు యిప్పటికీ చేపలు తింటారు.

భోజనానికివచ్చిన ఆ బ్రాహ్మణులు, రాక్షసుడు యిల్వలుడు పెట్టిన ఆహారము తిని కులాసాగా కూర్చొన్న సమయాన వాతాపి సోదరుడు యిల్వలుడు "వాతాపీ! పైకిరమ్ము!" అని వాతాపిని పిలిచేవాడు.

వెంటనే వాతాపి ఆ బ్రాహ్మణుల కడుపులు చించుకొని పైకి వచ్చేసేవాడు. పాపము ఆ బ్రాహ్మణులు చచ్చిపోయేవారు. ఈవిధముగా ఆ యిద్దరు రాక్షసులు అనేకమంది బ్రాహ్మణులను చంపేశారు.

ఈ సంగతి ఏలాగో అగస్త్య మహాఋషికి తెలిసింది. ఈ రాక్షసులను వంచించాలని తలచి ఒకరోజున వాతాపి యింటికి అగస్త్యుడు భోజనానికి వెళ్లాడు. యథాప్రకారము యిల్వలుడు అగస్త్యునికి భోజనము పెట్టాడు. అగస్త్యుడు సావకాశముగా కడుపునిండా భోజనముచేసి వెంటనే "జీర్ణం! జీర్ణం!! వాతాపి జీర్ణం!!!" అని అనుచు చేతితో తన కడుపుమీద రాసుకొని త్రేవున త్రేన్చివేసాడు. ఆ ఋషి కడుపులో వాతాపి జీర్ణమైపోయాడు. ఈ సంగతి తెలియక, యిల్వలుడు మామూలుగా, "వాతాపీ! పైకిరమ్ము" అని పిలచాడు. కాని వాతాపి పైకి రాలేదు! కడుపులో జీర్ణమైపోయి చచ్చిపోయాడు.

ఇప్పటికీ మన తెలుగుదేశములో చంటిపిల్లలకు ఉగ్గు-పాలు పట్టినతరువాత "జీర్ణం! జీర్ణం!! వాతాపిజీర్ణం!!!" అని అనుచు చంటిపిల్లల కడుపుపైని చేతితో రాయుట ఆచారమై యున్నది. దీనికి కారణము అగస్త్యుని కడుపులో వాతాపి అనే రాక్షసుడే జీర్ణమైనప్పుడు, చంటిపిల్లల కడుపులో ఉగ్గు-పాలు జీర్ణముకాదా యని వారినమ్మకము.

చంటిపిల్లల తల్లులు యీవిధముగాకూడ పాడుతారు.

పాట:

జీర్ణం! జీర్ణం!! వాతాపి జీర్ణం!!!
గుఱ్ఱానికి గుగ్గిళ్లు జీర్ణం!
ఏనుగుకి వెలగకాయలు జీర్ణం!
మహాలక్ష్మికి మామిడిపళ్లు జీర్ణం!
ఆదినారాయణమూర్తికి అరటిపళ్లు జీర్ణం!
గోపాలస్వామికి కొబ్బరికాయలు జీర్ణం!
అర్జునుడికి వెన్నప్పాలు జీర్ణం!
భీముడికి పిండిపంటలు జీర్ణం!
మా బాలకి ఉగ్గు-పాలు జీర్ణం!



# నెల పొడుపు

— సోమసుందర్ —

వచ్చాడమ్మా ! వచ్చాడమ్మా !
వచ్చాడమ్మా నెలవంకా !
పడమటి కొండను
ఆడే నటేశు జిలిబిలి
తలలో - మల్లెల దండయి
వచ్చాడమ్మా ! నెలవంకా !

* *

పార్వతిముక్కుకు నత్తంటమ్మా !
పడమటికొండకు నిండంటా !
పాలకడలికే పాపాయంటా
కొండకొప్పులో నెలవంకా !
వచ్చాడమ్మా ! నెలవంకా !

* * *

తొట్లోపెట్టే పండుగకోసం
వచ్చారంటా పేరంటం !
చుక్కలరాణుల పేరంటం !
ఊయల లూచే పేరంటం !
టం !...టం !...టం...!
వచ్చారంటా పేరంటం !

* * *

వియత్తలంలో తొంగిచూపులకు
కొలనులా రేగెను కోలహాలం !
కన్నులుతెరచిరి కలువసఖుల్ !
హారతులెత్తిరి వలపుచెలుల్ !
వచ్చాడమ్మా ! నెలవంకా !
మబ్బుగుఱ్ఱముల కళ్లెంపట్టీ
వచ్చాడమ్మా నెలరౌతు !
స్వారికి అలసిన గుఱ్ఱపునురుగలు
తెల్లని తుంపరలెగిరాయి.
వచ్చాడమ్మా ! నెలవంక !
అమరులు అతనిని ఆకసపొలాల
హాలంగ పట్టుకు దున్నేరు.
చీకటిచాళ్లుగ విడిపోయె !
వచ్చాడమ్మా ! నెలవంకా !

* * *

చుక్కలకెంతో పండుగకాగా
ముంగిట ముగ్గులు దిద్దారు.
తక ధిమ్మంటూ గెంతారు.
ప్రేమాలసులై వలపుపూలతో
పూజలుచేస్తూ గెంతారు.
తక ధిం ధిమ్మని గెంతారు.
నోములునోస్తూ గెంతారు.
తక ధిం ధిమ్మని గెంతారు.
వచ్చాడమ్మా వచ్చాడమ్మా
వచ్చాడమ్మా ! నెలవంక !

(సినీవాలినుంచి)

[హక్కులు 'శశాంక' వి.]


# అమ్మ దొంగ! - నాన్న దొంగ!

రచన: కవికొండల వెంకటరావు

కూర్మనాథం బలే కొంటె పిల్లవాడు. అతణ్ణి వాళ్ళనాన్న వొక పర్యాయం కోరుకొండ రథోత్సవానికి తీసుకువెళ్ళాడు. అసలు ఆ కొండే ఒక పెద్ద రథంలా కనిపిస్తూ వుంటుంది. కాని కొండకు చక్రాలుపెట్టి తాళ్ళుకట్టి లాగేందుకు వల్లకాదు. కాబట్టి కర్రతో ఆవాటంగా ఒక రథం తయారుచేసి, రథానికి రంగులుపూసి, దేవుని ఆరథంలో కూర్చోపెట్టి ఊరేగిస్తారు. అయితే రథం ఇరుకు వీధులంట నడిచేటప్పుడు, అరుగులు విరిగిపడిపోతాయి, చూరుల నుండి పెంకులు వూడి పడిపోతాయి. నడుమ నడుమ మనుష్యులున్ను నలిగి నుగ్గయిపోతూ వుంటారు. ఆ కారణంచేత కూర్మనాథాన్ని తండ్రి విశాలమైన చెలకమీద నిలబెట్టాడు. కాని రథం చెలకమీదకు వచ్చేసరికి సాయంకాలం పడుతుంది.

ఆ లోపున అదిచూచి, ఇది చూచి మారాంపెడితే, పిల్లడికి తండ్రి ఒక యీల, ఒక తాడెక్కు బొమ్మ, ఒక కాగితపు పాము కొనిపెట్టాడు.

అంతలో చెలకమీద కూడా జనం మూగేశారు. బాజాలు భజనలు గాలిలో ధ్వనిస్తున్నాయి. అందరి దృష్టి రథం చూదామనే వుంది. మలుపు తిరిగి రథం చెలకమీద సాయంకాల సంధ్యాకాంతినే తళుక్కుమంది. రథంమీది తెక్కలగుత్తాలు, రిబ్బన్ కళ్లాలు, జనపనార తోకలు, లక్కరంగుల డెక్కలు, నిక్కినింగినంటే చెవులు ధగధగమన్నాయి. సారథిబొమ్మ కొరడాకర్ర జిగేల్ మంది. లోపలి స్వాముల త్రిపుండ్రాలు అరటిపళ్ళ దెబ్బలకు చమక్ చమక్ మంటున్నాయి. చెంప లెగిరిపోకుండా చూచుకొంటూ రథంమీద కంచు కాగడాలు కనక కాంతులిస్తు



న్నాయి. దేవుని వెనుతట్టు బంయిమని బాకా వూత్తున్నారు.

కూర్మనాథం వుండబట్టలేక తనచేతిలోని ఈల లెక్కలేనన్ని సార్లు ఊదాడు. తాటెక్కు బొమ్మను రథమెత్తూ లేవాలన్నాడు. కాగితప్పామును రథమ్మీదకే వొదిలాడు.

కొడుకెక్కడ రథం క్రింద పడిపోతాడో అని కూర్మనాథం తండ్రి కూర్మనాథాన్ని ఇవతలకు లాగి, 'ఇక్కడ కాదు ఆట' అని కోపపడ్డాడు. తండ్రిని అనుసరిస్తూ కూర్మనాథం దేవునికి నమస్కరించాడు. రథం కడచనడం చూస్తూ కూర్మనాథం తండ్రి నడిగాడు, "మళ్ళీ ఎప్పుడు నాన్నా! రథాన్ని చూడ్డం" అని. తండ్రి "మళ్లీ యేటికి" అన్నాడు. కొడుకు "ఏటికంటే ఎన్నాళ్ళు నాన్నా?" అన్నాడు. తండ్రి 'మూడువందల అరవయి అయిదు రోజులు' అన్నాడు.

మూడువందల అరవయి అయిదు అడుగులు ఒకటి రెండు అని లెక్కించుకుంటూ కూర్మ

నాథం ఆనాటి రాత్రికి ఇల్లు చేరాడు.

ఇల్లుచేరడమేమిటి, అబ్బాయి ఈల ఊదడమేమిటి! ఈల ఊదడమేమిటి తాడెక్క బొమ్మనాడించడమేమిటి? తాడెక్క బొమ్మనాడించడమేమిటి కాగితప్పాము అందరి కళ్లల్లోకి వదలడమేమిటి? ఇల్లంతా రణగొణధ్వని చేసేశాడు కూర్మనాథం. తండ్రి "ఇప్పుడు కాదు ఆట" అని కోప్పడి అవన్నీ ఊళ్ళాక్కుని మేజాబల్లసొరుగులో పెట్టిదాచేశేదాకా ఇంట్లో వాళ్ళకీ నిదరట్టలేదు.


అర్ధరాత్రి నిద్రలో కూర్మనాథం ఉలిక్కిపడ్డాడు "అమ్మ దొంగ! నాన్న దొంగ" అంటూ. తల్లిదండ్రులు భయంలేదని చెరోపక్కకు వచ్చి బిడ్డని చూచారు. "అమ్మ దొంగ! నాన్న దొంగ! మీరు సొరుగుతీసి ఆడుతున్నారా?" అని తలిదండ్రులకేసి చూసి "నా చెవిలో ఈలేశావు నువ్వు! నా కాళ్ళ దిక్కున ఆడించేవు తాడెక్కగాణ్ణి; నా పక్కచుట్టూ పాకేసింది పాము." అన్నాడు కూర్మనాథం.

వెంటనే తలిదండ్రులు "నీకు వచ్చింది కల బాబూ! నిజమాట కాదు. మా కెందుకు నీ ఆటవస్తువులు" అని సొరుగుపాళంగా ఊడదీసుకొచ్చి చూపించారు. అవన్నీ తన మంచంక్రింద పెట్టమన్నాడు కూర్మనాథం. అల్లాగే చేశారు తల్లిదండ్రులు. సొరుగుతాళంచెవి తన కిమ్మన్నాడు. అల్లాగేచేశారు. "మరి నిద్రపో. అన్నీ మఱచిపో. దేవుణ్ణి తలుచుకో." అని తల్లిదండ్రులు కూర్మనాథాన్ని నిద్రపుచ్చారు ఎల్లాగైతేం.

ఆపని ఈపని చేసికొని తల్లిదండ్రులు తెల్లారి పక్కమీద చూస్తే కూర్మనాథం మంచంమీద లేడు. ఏమైపోయాడు వీడు అని తలి అఱచినా పలకడు! 'ఒరేయి! ఏడీ?' అని తండ్రి ఇదైనా కనబడడు. తల్లి పరుపెత్తిచూస్తే మంచం కళ్ళల్లోంచి ఎదోమెరిసినట్టయింది. చూస్తే కూర్మనాథం కళ్లు! ఈల వూత్తూమెరిసిపోతు

న్నాయి. 'మంచం ఎత్తునాన్న! తాడెక్కు బొమ్మకుతగుల్తోంది, నా తాడెక్కు బొమ్మకు తగుల్తోంది' అన్నాడు. తండ్రి మంచమెత్తే సరికి ఇద్దఱి మీదకూ కాగితపు బొమ్మను వూడాడు. పాముగా బుస్సుమంది అది. ఓరి! దొంగా అన్నారు తలిదండ్రు లిద్దరూ కూర్మనాథాన్ని. 'తెల్లాఱకుండా నేఆటలటరా?' అని నవ్వారు. తెల్లాఱకుండా కూర్మనాథం ఇరుగుపొరుగు ఆడపిల్ల గోపెమ్మ అప్పుడే వచ్చింది. కూర్మనాథం గోపెమ్మ చెవిలో గింయిమనేలా ఈల వూదాడు. గోపెమ్మ తల్లి దండ్రులు గోడావలనుంచి తొంగి చూస్తూ 'అవేం ఆటలు? అబ్బాయి!' అని గ్రుడ్లుఱిమారు. వెంటనే కూర్మనాథంగారి కుక్క అగోడావలివాళ్ల మీదకు బొంయిమంది. 'మావాళ్ళ మీదకూ బొంయి మంటుందీ మీకుక్క?' అని అడిగింది గోపెమ్మ అదోచిఱునవ్వుగా. కూర్మనాథం 'అనదుమతీ! మా వాళ్ళేమిటి? మీవాళ్ళేమిటి? అమ్మ దొంగలూ! నాన్న దొంగలూ! వీళ్ళందరూను' అన్నాడు గెంతుతూ.

## పదిహేను చుక్కల ముగ్గు



పంపినవారు: కిళాంబి ఊర్మిళాదేవి (విజయనగరం)


# అయ్యర్ పాటకచ్చేరి

రేడియో
గదిలో



★

ఇంట్లో



★

పార్కులో



బొమ్మలు : బుజ్జాయి

# సబ్బు బుడగలు

రచన: మహీధర సూర్యమోహన్‌రావు

"మురళీ! ఏం చేస్తున్నావ్?"

"దీపాలు తుడిచి అమ్మకి సహాయం చేస్తున్నా."

"నీ మొహం! ఆ దీపంచిమ్నీ విరిచీగలవ్!—ఇలారా. నీ కో మంచికథ చెప్తా."

"ఉండు. ఇప్పుడే యీ మసి చెయ్యి కడుక్కొని వస్తాను"

* * *

మురళి గబగబ పెరట్లో కెళ్ళి, కుళాయి తిప్పి, దారకింద చేతులుపెట్టి కూర్చున్నాడు. ఎంతకీ మసిపోదు.

"ఎంత కడిగినా మసిపోలేదు బాబయ్యా" అన్నాడు మురళి.

"కుళాయి కింద చేతులు పెట్టుకుకూర్చుంటే మసి పోతుందా! ఆ సబ్బుతో బాగా నురుగు వచ్చేటట్టు తోమి కడుక్కో"— అన్నాడు సూర్యం.

మురళి అలాగ చేశాడు. మసి శుభ్రంగా వదిలిపోయింది!

"సబ్బు పట్టిస్తే మసి ఎందుకు పోతుంది బాబయ్యా! చెప్పవూ?" అని మురళి అడిగేడు.

"ఆ మసి ఏమిటో ఎరుగుదువా? అది చిన్నచిన్న బొగ్గు కణాలసమూహం. వాటి అంచులు మంచి పదునుగా వుంటాయి. అవి మన చర్మంలో ఉండే రంధ్రాల కంటిపెట్టుకుని కూర్చుంటాయి. వాటిని ఆ రంధ్రాల్లోంచి బైటికిలాగి అప్పుడు నీళ్ళుపోస్తే అవి కొట్టుకుపోతాయి. లేకపోతే ఎన్నినీళ్లు పోసినా, అవి కదలనే కదలవు. సబ్బుపట్టిస్తే, వాటిని నురుగు బైటకి లాగుతుంది. అందుకే మసి త్వరగా పోతుంది" అని మొదలుపెట్టేడు సూర్యం.

"బాగా నురుగువచ్చే సబ్బు మంచిదా, కొంచెం నురుగు వచ్చేది మంచిదా?"

"బాగా నురుగువచ్చేదే మంచిది."

"నురుగు అంటే ఏమిటి బాబయ్యా?" అన్నాడు మురళి.

"సబ్బు బుడగల్ని చూసేవు కదూ? అలాంటివే చిన్నచిన్న బుడగలు వేలకోలది ఉంటాయి నురుగులో. వాటి మధ్య గాలి ఉంటుంది. ఆ నురుగు చేతులికి పట్టిస్తే బొగ్గుకణాల్ని రంధ్రాల్లోంచి పిలక పుచ్చుకొని బైటికి లాగుతాయి ఆ బుడగలు. అప్పుడు నీరుపోస్తే ఆబుడగల్ని, వాటి కంటిపెట్టుకొన్న బొగ్గుకణాల్ని కడిగేస్తుంది."

"బంగారం, వెండి మొదలైన ఖనిజాలు మొదట, భూమి క్రింద పనికిరాని, రాళ్లు, మట్టితో కలిసి దొరుకుతాయి. అటువంటి రాళ్ళను మెత్తగా చూర్ణంచేసి పెద్దపెద్ద సబ్బునీళ్ళ తొట్లల్లో వేసి బాగా నురుగువచ్చేలా కలుపుతారు. ఖనిజ రేణువులు, ఇసక, మట్టి, అన్నీ సబ్బు బుడగలకి అంటుకొని పైకివస్తాయి. కాని కొంతసేపటికి పనికిరాని, ఇసక, మట్టి మొదలైనవి క్రింద పడిపోతాయి. ఖనిజరేణువులు మాత్రం బుడగల్ని అంటిపెట్టుకొని పైనే ఉంటాయి. అప్పుడా "తెట్టె" వేరేతీసి కడిగితే అందులో ఖనిజాలు దొరుకుతాయి. ఈ విధంగా సబ్బుబుడగల్ని ఆడుకుందుకే కాక, మనకి అనేక పనులు చేసిపెట్టేందుకూడా ఉపయోగిస్తున్నాం తెలుసా?" అన్నాడు సూర్యం.

"సరే అయితే కథ చెప్తానన్నావు చెప్పవూ?"--అన్నాడు మురళి.

"ఇదే కథ. ఇది సబ్బుబుడగల కథ"--అన్నాడు సూర్యం.



# ★ ఈత కొట్ట నేర్చియుండు ★

రచన: ఎ. ఆర్. కె. మూర్తి (నూజివీడు)

అనగా అనగా ఒక బ్రాహ్మడు ఒకనాడు కాశీకి ప్రయాణం చేస్తున్నాడు. ఆ బ్రాహ్మడు బాగా చదువుకున్నాడు. కాని అతనికి చాలా గర్వము.

ఆ బ్రాహ్మడు అలా ప్రయాణం చేస్తూవుండగా, త్రోవలో ఒక నది అడ్డు వచ్చింది. నది దాటడానికి ఒక పడవవాడిని పిలిచాడు.

"కూర్కోండి బాబూ పడవలో," అన్నాడు పడవవాడు.

బ్రాహ్మడు పడవలో కూర్చున్నాడు.

బ్రాహ్మడు :-ఓరీ! పడవవాడా! నీకు చదువు వచ్చునా?

పడవవాడు :-రాదు సామీ!

బ్రాహ్మడు :-అబ్బే! ఇంతేనా! అయితే నీ జీవితంలో పాతిక (నాలుగోవంతు) వ్యర్థం!... పోనీ, నీవు దానం ధర్మం ఏమేనా చేశావా?

పడవవాడు :-అదేదో నాకు తెల్దు బాబూ.

బ్రాహ్మడు :-ఐతే నీ జీవితంలో ఇంకో పాతిక వ్యర్థం అన్నమాట. మొత్తం సగం జీవితం నీది వ్యర్థం.

(ఇంతలో తుపాను వచ్చింది)

పడవవాడు :-బాబూ! తుపాను వచ్చింది! మీకు ఈత వచ్చునా?

బ్రాహ్మడు : రాదురా!

పడవవాడు :-అయితే మీజీవితం అంతా వ్యర్థమే బాబు! ఇదుగో పడవ మునిగిపోతోంది!

తుపానులో పడవ మునిగింది. ఈత వచ్చిన పడవవాడు యీదుకుంటూ ఒడ్డు చేరుకున్నాడు. పాపం ఆ బ్రాహ్మడు నీటిలో మునిగిపోయాడు. గనుక :

ఈతకొట్ట నేర్చియుండు.

# పొడుపు కథలు

## 1

మా తాత రెండు ఎద్దులను బజారులో కొనెను. అవి అమ్మ అంటే పోట్లాడును. నాయన అంటే పోట్లాడవు. అవి ఏవో చెప్పండి.

సంపాదన : బి. యన్. జయ (మద్రాసు)

## 2


నూతిలోని పాము - నున్నన్ని పాము
చారచారల పాము - చక్కన్ని పాము

## 3

నూతి లోని బిందె - నున్నన్ని బిందె
చారచారల బిందె - చక్కన్ని బిందె

సంపాదన : ధూళిపాళ్ళ కృష్ణమూర్తి.

[జవాబులు యీసంచికలోనే వున్నాయి.]



# తపస్సు

"ఆనంద"

"ఒరే! అబ్బాయీ ఏంచేస్తున్నావురా?"

"బొమ్మలు చూస్తున్నానండి నాన్నారు. ఈ బొమ్మ చాల గమ్మత్తుగావుంది. మనిషి తలక్రిందులుగ నుంచున్నాడండి నాన్నారూ- ఇదేమిటండి?"

"ఓహో! అదా? ఆ ఋషి తపస్సుచేస్తున్నాడురా తలమీద నిలుచుని."

"అలా ఎందుకుచెయ్యాలండి తపస్సు? మామూలుగా కూచోరాదు ఆ అడవిలో?"

" ఎందుకనంటే - చెప్పనా? మఱి అడవిలో పులులు అవీ వుంటాయా?"

"ఊఁ - ఉంటాయి."

"అవి, మనుష్యుల్నిచూస్తే చంపుతాయి. వాళ్లుచచ్చిపోతారు!"

"ఆఁ-అవునండి నాన్నారూ!"

"మరేమో పులికి అడపాపట."

"అంటే ఏమిటండి?"

"అడ్డపాపంటే దానికన్ను అడ్డంగా వుంటుందిట. అదిచూస్తే దానికి ప్రతివస్తువు తలక్రిందులుగా కనపడుతుందిట."

"ఆఁ హాఁ ఆలాగాండి!"

"కాబట్టి ఋషి మరి తిన్నగా కూచుంటే పులికి తలక్రిందులుగ కనబడతాడు పెద్దదెయ్యంలాగ!"


"అవునండి."

"మరి. అందుకని దానికి భయమేసి ఆ ఋషిని చంపుతుంది."

"చచ్చిపోతే ఎలాగండి! తపస్సు-?-"

"అందుకనే, ఋషి తలక్రిందులుగకూచుంటే పులికి తిన్నగా కూచున్నట్లు కనబడతాడు. అసలు దానికి మనిషినిచూస్తే భయము. అందుకని పారిపోతుంది. ఋషి హాయిగా తపస్సు చేసుకుంటాడు."

"బాగుందండి నాన్నారూ కథ. నేనువెళ్లి నా స్నేహితులందరికి చెప్పివస్తాను త్వరగా-"




**The Hindu Matrimonial Bureau, BEZWADA.**

వివాహము నిమిత్తము వధూవరులను కోరువారు మా హిందూ వివాహ బ్యూరో [రిజిష్టర్డు నెం, 171] వారితో సంప్రదించిన మంచి సంబంధములు త్వరలో అనుకూలము కాగలవు.

కడు బీద కుటుంబీకుల పిల్లలకు మాత్రమే మా స్వంత ఖర్చులతో వివాహము చేయబడును.

ఆఫీసు:
రాజారాం ఫ్యాక్టరీ మేడమీద.
బెజవాడ.

ఇట్లు, ప్రొప్రయిటరు,
టి. జ్వాలా నరసింహ్వాం.

# మనమరాలు

రచన : వేటూరి ప్రభాకరశాస్త్రి

"తాతయ్యా ! నాకు మనమరాలు కావాలి తెచ్చిపెట్టు"

"తాతయ్యకు మనమరాలుగాని నీకేమిటమ్మా !"

"తాతయ్య కెందుకేమిటి ? నాకే కావాలి."

"అయితే నీవు నాఅంతదానవయితే మనమరాల్ని చూతువుగాని; ఇప్పుడెక్కడిదీ ?"

"కాదు. ఇప్పుడే కావాలి."

"అయితే చిన్నబొమ్మ కొనితెచ్చి పెట్టుతాను. దాన్ని మనమరాలనుకో !"

"బొమ్మ నా కెందుకేమిటి ? మనమరాలే కావాలి."

"ఏంచేస్తావేమిటి మనమరాల్ని ?"

"తింటాను."

"ఓహోహూ ! అలాచెప్పు ! ఇదుగో ఇంతలోనే తెప్పిస్తాను చూడు మనమరాల్ని."

అని, తాతయ్య అణాయిచ్చి, ఆనందుని బజారుకు పంపించి 'మరమరాలు' తెప్పించి 'మనమరాలి' కిప్పించినాడు.

ఎంత అనిపించినా మనుమరాలు 'మనమరాలు' అనే అంటుంది కాని 'మరమరాలు' అనలేక పోయింది. 'మర' అంటుంది; 'మరాలు' అంటుంది కాని కలిపి 'మరమరాలు' అనలేకపోయింది.



# అక్కతో 5 నిమిషాలు

చిట్టి చెల్లాయిలూ !

చిట్టి తమ్ముళ్ళూ !

బాలసంఘాలు అంటే ఏమిటి? అవి ఎందుకు ? వాటి నిబంధన లేమిటి? – అంటూ చాలామంది ఉత్తరాలు వ్రాశారు. బాల సంఘాలు పెట్టడంలో ఉద్దేశం—

1. పిల్లలంతా నెలకోసారి కలిస్తే, ఎంతో సరదాగా వుంటుంది.

2. కొత్త పిల్లల పరిచయం కలుగుతుంది.

3. అందరూ కలిసి ఆడుకోవచ్చును, పాడుకోవచ్చును, కొత్త కొత్త సంగతులు తెలుసుకోవచ్చును, నృత్యాలు చిన్నచిన్న నాటికలు వేయవచ్చును.

4. ఆటల్లోనూ, పాటల్లోనూ, ఉపన్యాసాల్లోనూ పోటీలు పెట్టి, బహుమానా లిప్పించవచ్చును – ఇంకా ఎన్నెన్నో ఆయా వూరిని బట్టి, పిల్లల ఉత్సాహాన్ని బట్టి చేయవచ్చును.

ప్రతివూళ్ళో ఇటువంటి బాల సంఘాలు పెట్టి ఆ సంఘాల న్నీ చేసేపనులు, మదరాసు "బాల" ఆఫీసులోవున్న బాలానంద సంఘానికి పంపుతే, వారు మీ సంఘంపేరు రిజిస్టరుచేసి, మీరు పంపే వార్తలు "బాల" లో ప్రచురిస్తారు.

* * *

అన్నట్టు "బాల" పుట్టిం రోజు పండుగ ఈ ఆగస్టు నెలలో జరుగుతుంది మీకు తెలుసా ?

పుట్టింరోజు "బాల" సంచిక మీరందరూ తెప్పించండేం—

"అక్క"

# బాల సంఘాలు

## ఊటుకూరు బాల సంఘం :

2-5-46 తేదీని శ్రీరామకృష్ణ గ్రంథాలయ వార్షికోత్సవ సందర్భంలో బాల సంఘంవారు బాలసంఘం పాటలు పాడారు. శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్యగారు "పిల్లల విద్య" గురించి చెప్పారు. ఈ సంఘంలో 100 మంది సభ్యులు వున్నారు.

## యండగండి బాల సంఘం :

8-5-46 తేదీని యీ బాలసంఘం స్థాపించారు. బాల బాలికలు 30 మంది సభ్యులు చేరారు. బాలసంఘం ఆటల పోటీలు జరుపుచున్నారు.

## ఢిల్లీ చలో బాల సంఘం (గన్నవరం) :

ఈ సంఘంవారు 18 వ తేదీని సమావేశమై "బాలజ్యోతి" అను వ్రాత పత్రిక నడుపుటకు తీర్మానించారు. శ్రీ వెన్నా వెంకటస్వామి సంపాదకుడు.

## గాంధీ బాల సంఘం (ధవళేశ్వరం) :

18-5-46 తేదీని యీ సంఘం కొత్తగాచేరి, శ్రీ ఆదుర్తి రవీంద్రనాద్ అధ్యక్షుడుగను శ్రీ ఇవటూరి శివసుందరరావు కార్యదర్శిగను ఎన్నుకొన్నారు. శ్రీ వి. సుబ్రహ్మణ్యేశ్వర రావుగారు బాల సంఘాలగురించి చెప్పారు. మొత్తం 14 మెంబర్లు చేరారు.

## శ్రీ సరస్వతి స్టూడెంట్సు సంఘం (తిరుపతి) :

ఈ సంఘం వార్షికోత్సవం మే 9, 10 తేదీలలో శ్రీ ఈ. కేశవులుగారు అధ్యక్షతను జరిగింది. ఆట పోటీలు జరిగి బహుమతులు ఇచ్చారు. కార్యదర్శి సి. శ్రీనివాసరావు, ఈ. శ్రీధరన్ గార్లు ఉపన్యశించారు. 1942 ఉద్యమంలో చనిపోయిన బాలవీరులకు, శ్రీ బులభాయి దేశాయిగారు గతించినందులకు విచారమును తెలియజేశారు.

## ఉదయభాను బాల సంఘం (మైలాపూరు) :

ఈసంఘం 22 తేదీని సమావేశమై శ్రీ E. Y. శాస్త్రిగారిని అధ్యక్షునిగా ఎన్నుకొన్నారు. సెక్రటరీ శ్రీ ముళ్ళపూడి వెంకటరమణ తమ సంఘం ఆదేశాలు తెలియచేశారు. సైక్లోస్టయిలు యంత్రంమీద 'ఉదయభాను' అని ఒక లిఖితపత్రికను మూడునెలలకొకసారి నడిపించడానికి నిశ్చయించారు. చి॥ శంకు. లీలా "గొల్లభామ" నాటిక వేశారు. చి॥ భారతీ, చెల్లాయి, శాస్త్రి పాటలతోను, మిఠాయి పంపకంతోనూ సభ ముగిసింది.

## త్యాగరాయనగర్ బాలసంఘం:

ఈ బాలసంఘం నడుపుతున్న కళోదయ పాఠశాల వార్షికోత్సవం మే 6 తేదీని, మద్రాసు వి. పి. హాలులో శ్రీ గుంటూరు నరసింహారావుగారి అధ్యక్షతను జరిగింది. బాలికలు తాము నేర్చుకొన్న నృత్యాలు, ఎంతోచక్కగా ప్రదర్శించారు. శ్రీ గుంటూరు నరసింహా

రావుగారు, శ్రీ పూరం ప్రకాశరావు గారు యీ బాల సంఘానికి చెరి 100 రూ॥ చొప్పున విరాళాలు ఇచ్చారు. శ్రీ నాళం రాఘవమ్మగారు యీ సంఘాన్ని ఎంతో బాగా నడుపుచున్నందులకు సంతోషము.

## వార్షికోత్సవాలు

పెద్దాపురం శ్రీరామా హిందూ ఏయిడెడ్ ఎలిమెంటరీ పాఠశాల:

ఈ పాఠశాల 11 వ వార్షికోత్సవము 8-5-46 తేదీని శ్రీ గోళ్ళ నాగేశ్వరరావుగారి అధ్యక్షతను జరిగింది. బాల బాలికలు 'జ్ఞానోదయం' 'భగవంతునిదయ'' అను నాటకములు వేశారు. నృత్యంచేశారు. పాత విద్యార్థులు పగటి వేషాలువేశారు శ్రీ డి. సత్యనారాయణ మూర్తిగారు, ఇతరులు ఉపన్యాసాలిచ్చారు. శ్రీ సీతారామారావు గారి కృతజ్ఞతా వందనముతోను, తెలుగు తల్లికి మంగళముతోను సభ ముగిసింది.

బాలానంద సంఘ సభ్యులు :

శీతేపల్లి వెంకటప్పయ్య శర్మ, శ్రీ రామమూర్తి, సావిత్రి (బెజవాడ).




తల వెండ్రుకలను పెంచును

రీటా కుదుళ్ళకు బలమునిచ్చి, నిగనిగలాడు నిడుపాటి వెండ్రుకలను పెంచుటకు అద్భుతమైన హెయిర్ టానిక్. తల వెండ్రుకలు రాలుట, నెరయుట, చుండ్రు, బట్టతల, పేనుకొరుకు, ఇంకను తలవెండ్రుకలకు సంబంధించిన సమస్త వ్యాధులకు రీటా అమోఘముగ పనిచేయును. వేనకువేలు వాడి గుణమును పొందియున్నారు. మీరుకూడ నేటినుండి రీటాయే వాడుడు.

రీటా హిందూదేశ మంతటా దొరకును. వెల సీసా 15 అణాలు

# ఏమన్నారు?

మహాత్మగాంధీ ఏమన్నాడే?
ఒకరిని హింసించొద్దన్నాడు.

పండిత నెహ్రూ ఏమన్నాడే?
బ్రిటీషువారిని పొమ్మన్నాడు.

డాక్టరు పట్టాభి ఏమన్నాడే?
ఖద్దరు బట్టలు కట్టన్నాడు.

ఆంధ్రకేసరీ ఏమన్నాడే?
తెలుగుజెండా ఎత్తన్నాడు.

కాంగ్రెసునాయకు లేమన్నారే?
ఇప్పుడె స్వరాజ్యం ఇమ్మన్నారు.

రచన: కాకరపర్తి రంగారావు (బందరు)



# గుంటనక్క

గుంటనక్క గుంటనక్క
ఎక్కడి కెళ్లావు ?

పెంటపాడు కాపువాని
యింటి కెళ్లాను

గుంటనక్క గుంటనక్క
ఏమిచేశావు ?

ఆ కాపువాని కోడిపిల్ల
కరచుకొచ్చాను.

రచన : పి. విశ్వనాధరావు.



# అగ్గిలాటెది!

అంగర

సుందరం చాల మంచివాడు. చాల చురుకైనవాడుకూడ. క్లాసులో అతనిదే మొదటి మార్కు. సుందరం అంటే వాళ్ల అమ్మకి నాన్నకీ ఎంతోముద్దు. సుందరం ఇప్పుడు మ్యునిసిపల్ హైస్కూల్లో నాలుగోతరగతిచదువుతున్నాడు.

సాయంత్రం స్కూలు వదిలారు. సుందరం సరాసరి యింటికి వచ్చేసాడు. పుస్తకాలు యింట్లోపడేసి ఆటకి పారిపోతున్నాడు. ఇంతలో వాళ్ల అమ్మ పిలిచింది. పిలుపు విని వాళ్ల అమ్మదగ్గరకు వెళ్లాడు.

లాంతరుకి చిమ్నా విరిగిపోయింది. చిమ్నా కొత్తది వేస్తేనే గాని రాత్రి సుందరం చదువుకుందికి వీల్లేదు. వాళ్లమ్మ డబ్బులు యిచ్చింది చిమ్నా తెమ్మని. సరేనని డబ్బులు తీసుకుని చిన్నబజారుకి వెళ్లాడు.

చిన్నబజారులో సుబ్బిశెట్టిది పెద్దకొట్టు!

అంతేకాదు. సుబ్బిశెట్టి మంచి మాటకారి. తనే తెలివైనవాడిననుకునేవాడు. దుకాణానికి వచ్చినవాళ్లని ఏదో వంకన నవ్విస్తూండేవాడు.

సుందరం సుబ్బిశెట్టి కొట్టుకే వెళ్లాడు.

"ఏం కావాలి?" అని సుబ్బిశెట్టి అడిగాడు.

"చిమ్నా కావాలి" అన్నాడు సుందరం. నాలుగణాలు చిమ్నా వెల సుబ్బిశెట్టి తీసుకుని, చిమ్నా ఒకటి సుందరానికి యిచ్చాడు.

మంచిదో కాదోనని సుందరం దానిని జాగ్రత్తగా చూసినతరవాత అన్నాడు:

"శెట్టీ! ఇది మంచిదేనా?" అని అడిగాడు.

"ఓ! అగ్గిలాటెది!" అని శెట్టి తన మాటకారితనం వొలకబోశాడు సుందరం ముందు.


'అగ్గిలాటిదా! బాబోయ్! చెయ్యి కాలింది!' అని సుందరం తన చేతిలోని చిమ్నీ జారవిడిచేసాడు.

చిమ్నీ ముక్కముక్కలైంది!

ఒకసారి శెట్టి, సుందరం ముఖాలు చూసుకున్నారు. ఆక్కడున్నవాళ్లంతా సుందరం వేసిన ఎత్తుకి, శెట్టివేపు చూసి విరగబడి నవ్వారు.

"అమ్మ పంతులు! ఎంతపని చేసావ్!', అని అందరితోబాటు తనూ నవ్వేసి మరొక చిమ్నీ యిచ్చి సుందరాన్ని పంపేశాడు!

## గీతల్లో బొమ్మ



ఈ పై బొమ్మలో చుక్కలు పెట్టిన గదులకు సిరాతోగాని రంగు పెన్సిలుతోగాని రంగువేసి చూడుము.

## ప్రాణ స్నేహితుడు!

రచన: ఎద్దు పార్వతమ్మ, డి. పాలెం.

నేనెవరు నన్నెరుగుదురా?

మీరు నన్ను చూడలేరు. ఎందుచేతనంటారా? మీ కంటికి నేను కనుపించను. ఒకానొకప్పుడు వీధులలో మిక్కిలి వడిగా పరుగెత్తుతుంటాను. అప్పుడు అన్ని తలుపులు గజగజలాడును. వీధులలో మనుష్యుల టోపీలూ, పాగాలూ ఎగరగొడ్తాను.

కాని, నేను తుంటరివాణ్ని కాను. చాలామంచివాణ్ని. మీకూ నాకూ ప్రాణస్నేహం వుంది. నేను లేకుంటే మీరు ఒక్క నిముషమైనా వుండలేరు సుమండీ! నేనెవర్నో, నాపేరు చెప్పగలరా?

65-వ పేజీలోని పొడుపు కథలకు జవాబులు:

1. పెదవులు; 2. పొట్లకాయ; 3. గుమ్మడికాయ.

# బాలా! నీకు తెలియునా?

- 455,000 చంద్రుల కాంతి ఎంత ఉండునో ఒక్క సూర్యునికాంతి అంత ఉండును.
- చెరువులో సామాన్యపు చేప, ఒకేపర్యాయము 3,50,000 గ్రుడ్లు పెట్టును.
- "పెంగ్విన్" అను నీటిపక్షి, ఒకేపర్యాయము ఆగకుండా 600 మైళ్లు ఈదగలదు.
- ప్రపంచములోని దేవాలయపు గోపురాలన్నిటిలోను రామేశ్వరము నందుగల దేవాలయపు గోపురము మిక్కిలి ఎత్తైనది. దానిఎత్తు 2,145 అడుగులు.
- ఆస్ట్రేలియాలోని "మెక్రోజామియా" అనే చెట్టుయొక్క వయస్సు ఇప్పుడు 12,000 ఏండ్లు!

సంపాదన : ఘుండికోట సుబ్బారావు,
(శ్రీకాకుళము.)

---

# అంకెలతమాషా

11 × 11 = 121

101 × 101 = 10201

1001 × 1001 = 1002001

10001 × 10001 = 100020001

100001 × 100001 = 10000200001

1000001 × 1000001 = 1000002000001

సంపాదన : చేబోలు రామకృష్ణశాస్త్రి, విశాఖపట్టణం.

# ఇది చెప్పుకో చూదాం!

జూన్ ప్రశ్నలు

## I - గుఱ్ఱపుసాల

| | | |
|---|---|---|
| 3 | 3 | 3 |
| 3 | X | 3 |
| 3 | 3 | 3 |

ఈ 9 గదుల గుఱ్ఱపుసాలలో, మధ్య గదిలో గుఱ్ఱపువాడు వున్నాడు. చుట్టూవున్న ఎదిమిది గదులలో మూడేసి గుఱ్ఱములున్నవి. మొత్తం 24 గుఱ్ఱములు.

రాజు ప్రతిరోజూ వచ్చి, వరస గదులలో 9 గుఱ్ఱముల చొప్పున వున్నవో లేవో చూచి పోవును.

గుఱ్ఱపువాడు రాజుకు తెలియకుండ నాలుగు గుఱ్ఱములు అమ్మివేసెను. మిగిలిన 20 గుఱ్ఱములు ఏ వరుసను చూచిన 9 గుఱ్ఱములు వచ్చునట్లుగా తిరిగిపెట్టెను. అది ఎట్లు ?

పంపినవారు: డి. ఎస్. దక్షిణామూర్తిశాస్త్రి, (బరంపురం)

## II - చదరపు చిత్రము

__ __ __ మొదటివరుస: నేనుంటే భోజనంలో బలే రుచి.

__ __ __ రెండో వరుస: కత్తులతో పోట్లాడితే నేను తరచు కనబడతాను.

__ __ __ మూడోవరుస: పాపముచేస్తే నేనే శిక్షిస్తాను!

పంపినవారు: బి. పిచ్చయ్య గుప్త.

## III - సామెత

పికచెరణ ప్రాకులాటం ఎటంక సంకిల్లిలు

ఈ పై అక్షరాలు ఉపయోగించి ఒక సామెత చేయగలరా?

# మే బాలలోని ప్రశ్నలకు జవాబులు

I

## సింహాల మాట

కేసరి కేసరికే సరి
లేక
కేసరికే సరి కేసరి

II

## కోమటి పంపకం

1, 3, 9, 27 తులములు ముక్కలుగా విరిగెను.

III

## అక్షర ద్వీపము

"జ ల ము"

ద్వీపము ఎక్కడ వుండును ?
జలము మధ్య.

"ల" అనే అక్షరం ఎక్కడుంది ?

'జలము' మధ్య.

అంచేతే "ల" అనే అక్షరం ద్వీపం అని చెప్పొచ్చు.

ఈ మూడు ప్రశ్నలకూ సరియైన జవాబులు పంపినవారు :

కాకినాడ :

కూ. వెం. సుబ్బరామ సూర్యనారాయణ; కూ. శాంత; కూ. శ్రీరాములు; కూ. సీత; ఈ. రామలింగేశ్వర శర్మ; కూ. సుబ్బయ్యశాస్త్రి; దు. రంగారావు; వెం. శాంతాదేవి; దు. సుబ్రహ్మణ్యము; దు. సూర్యప్రకాశరావు; దు. బాలాత్రిపురసుందరి; దు. మాణిక్యాంబ; ని. నిత్యానందం.

నిడదవోలు :

ఎ. నాగమణి; ఎ. నాగరాజారావు.

చోడవరం :

పి. వెంకటరామశాస్త్రి.

బరంపురం :

అ. సూర్యారావు; ల. రామారావు; ల. శ్యామసుందరరావు; డి. ఎస్. దక్షిణామూర్తి శాస్త్రి.

విశాఖపట్నం :

డి. సరస్వతీదేవి; డి. వి. రామదాసు; డి. గోపాలస్వామి; మ. నరసింహారావు పంతులు; జి. సదాసివరావు; యమ్. యల్. నరసింహం; యమ్. విశ్వనాథం; తే. గోవిందరావు; చే. రామకృష్ణరావు; కె.వి. రామారావు.

తిరుపతి :

ఇ. శ్రీధర్; సి. శ్రీనివాసరావు; "ఆనంద".

రాజమండ్రి :

M. పద్మావతి; M. సాంబశివాచారి; M. లలిత; ఆ. సూర్యనారాయణ; ఆ. జగన్నాధం; ఆ. నరసింహశాస్త్రి; ఆ. శ్రీరామచంద్రమూర్తి; మా. వెంకట శేషాచలపతిరావు; మా. కనకరాజు పంతులు; మా. సూర్యనారాయణ బిరించి; మా. బాలసుబ్రహ్మణ్యకుమార్; మా. వెంకటరత్నం అరవిందాదేవి; ఫ. రామకృష్ణ పట్నాయక్; ఫ. కున్ని కృష్ణ పట్నాయక్; ఫ. బాలక్రిష్ణ పట్నాయక్; ఈ. కామేశ్వర శర్మ.

గుంటూరు :

ప. జ. భ్రమరాంబ; ఏకా ఆదిలక్ష్మి; వి. చెల్లాయి; వి. బాబు.

విజయనగరం :

ప. నిర్మల; జి. వి. రమణమూర్తి; M. S. R. K. శాస్త్రి; వి. జి. చి. సన్యాసిరాజు; గొ. శివరామక్రిష్ణ.


# "బాల" లో మీ ఫోటో!

"బాల" పుట్టినరోజు సంచికలో మీ ఫోటో వేయమంటారా?

పాపాయిలు చక్కని ఫోటోలు తీయించుకొని, ఫోటోతోసహా ఆరురూపాయిలు మనియార్డరు పంపుతే, ఫోటో "బాల" లో వేస్తాం.

వివరములకు :

మేనేజరు, 'బాల',
20, సుందరేశ్వర్ వీధి,
మైలాపూరు, మద్రాసు.




# పిల్లల తెలుగు ప్రోగ్రాముల వివరాలు

[211 మీటర్లు, 31.36 మీటర్లమీదా వినొచ్చు.]

[మధ్యాహ్నం 2-10 నుంచి 3 వరకు]

## జూన్

### 2 వ తేదీ ఆదివారం

పిలుపుపాట; ఉత్తరాల సంచి; బిచ్చగాని కూతురు - నాటిక; పుట్టిన రోజులు; పిట్ట కథలు; ఈగ-సాలీడూ—పాట కథ; మీరుపంపిన నాటికలు; చిక్కు ప్రశ్నలు; పోదామా.

### 9 వ తేదీ ఆదివారం

పిలుపుపాట; ఉత్తరాల సంచీ; తులసి - నాటిక; పుట్టినరోజులు; చిట్టి కథలు; పిల్లి అరుపు - పోటీ; భూగోళ చిత్రాలు; చిక్కుప్రశ్నలు; పోదామా.

### 16 వ తేదీ ఆదివారం

పిలుపుపాట; ఉత్తరాల సంచీ; కోతి బుగ్గలు-నాటిక; పుట్టినరోజులు; మీరుపంపిన కథలు; బుజబుజరేకులు-పాట; తాతయ్య కథ; చిక్కుప్రశ్నలు; పోదామా.

### 23 వ తేదీ ఆదివారం

పిలుపుపాట; ఉత్తరాల సంచీ; బుద్ధుడు - నాటిక; పుట్టినరోజులు; ఆవు అరుపు - పోటీ; నాగులమ్మ—పాట కథ; మీరుపంపినవి; చిక్కుప్రశ్నలు; పోదామా.

### 30 వ తేదీ ఆదివారం

పిలుపుపాట; ఉత్తరాల సంచీ; బడులు తెరుస్తారు - నాటిక; పుట్టిన రోజులు; భూకంపం - పాట కథ; శలవుల్లోచూచిన గమ్మత్తులు; చిట్టిపాటలు; చిక్కు ప్రశ్నలు; పోదామా.

Edited and Published by N. Raghava Rao, 20, Sundareswar St., Mylapore, Madras. Printed by B. Nagi Reddy at B. N. K. Press, 37, Acharappan St., G. T. Madras.

# అమృతాంజనము


AMRUTANJAN Pied PIPER of India.
AMRUTANJAN
AMRUTANJAN
ACHES
PAINS
COLD
GOUT
HEADACHE
PARALYSIS
RHEUMATISM

వస్తోంది! వస్తోంది!

# "బాల" పుట్టినరోజు పండగ!

ఆగస్టు మాసములో—

మన "బాల" కు

ఏడాది పుట్టినరోజు పండగ!

ఈ పండక్కి

మన "బాల"

ఎంతో సొగసుగా తయారవుతోంది.

వింత వింత కథలూ,

కబుర్లూ, బొమ్మలూ,

ఆటలూ, పాటలూ,

ఎన్నో వుంటాయి.

## పెద్ద సంచిక తయారవుతోంది.

వెల ఒకరూపాయి మాత్రమే!

వివరములకు:

మేనేజరు, "బాల"

20, సుందరేశ్వర్ వీధి, మైలాపూరు, మద్రాసు.


PRINTED AT THE B. N. K. PRESS, 37, ACHARAPPAN ST. MADRAS, 1.